
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శనివారం 5 ఏప్రిల్ 2025



రిజిస్ట్రేషన్ల స్లాట్‌బుకింగ్ ప్రారంభం


నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన స్లాట్ బుకింగ్ ప్రక్రియ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభమైంది. రిజిస్ట్రేషన్లు చేసుకునే వారు వారు కోరుకున్న సమయానికి స్లాట్ బుకింగ్ చేసుకుని దస్తావేజులను సాక్షులను, అమ్మకం, కొనుగోలుదారులను తీసుకొని వచ్చి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. తొలుత కొంతఇబ్బంది కలిగినా ఆ తరువాత రిజిస్ట్రేషన్ల జరిగిపోయాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారి చైతన్య స్లాట్ బుకింగ్ సమాయాన్ని, దస్తావేజులను పరిశీలించారు. అనంతరం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ సింహాద్రి వాటికి రిజిస్ట్రేషన్లు చేశారు.

ఆరోగ్యశ్రీకి బకాయిలు

జబ్బు!

- జిల్లాలో 30 ఆసుపత్రులకు రూ.150 కోట్లపైనే..
- సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితి

- బిల్లుల విడుదల కోసం ఎదురుచూపులు
- 7వ తేదీ నుంచి సేవలు ఆపేస్తాం : ఆశాలు



నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్యసేవ పథకం (ఆరోగ్యశ్రీ)లో అనారోగ్య పరిస్థితులు నెలకొంటున్నాయి. మూడేళ్లగా ప్రభుత్వం ఆరోగ్యశ్రీ నిధుల మంజూరులో తీవ్ర జాప్యం చేస్తోంది. ఇదిగో... వచ్చే నెలలో పూర్తిస్థాయిలో బకాయిలు మంజూరు చేస్తామంటూ చెబుతూనే ఉంది. గత వైసీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద రాష్ట్రంలోని నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.2200 కోట్ల బకాయిలు పెట్టింది. కూటమి ప్రభుత్వం కూడా దాన్ని మరో రూ.1300 కోట్లకు చేర్చి రూ.3,500 కోట్లకు చేర్చింది. ఇక జిల్లాలో పరిస్థితికి వస్తే రూ.150 కోట్లకుపైగా బకాయిలు ఉన్నాయి. అయితే కేవలం 8 శాతం నిధులు మాత్రమే విడుదల చేస్తుండటంతో నెట్‌వర్క్ ఆసుపత్రులలోని వైద్యులు, ఉద్యోగులకు కూడా వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది.

● పూర్తిస్థాయిలో చెల్లింపులు ఏవీ?

జిల్లాలో 30 నెట్‌వర్క్ ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. వీటికి కొన్ని ఆసుపత్రులకు రూ. 20 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. అలాగే జీజీహెచ్‌కి కూడా బకాయిలు చెల్లించాల్సి ఉంది. మొత్తంగా జిల్లాలోని నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ. 150 కోట్లకుపైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. గత వైఎస్ఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ బకాయిలు పేరుకుపోతున్నాయంటూ నెట్‌వర్క్ ఆసుపత్రి నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 7వ తేదీలోపు బకాయిలు చెల్లించాలని, లేదంటే ఆరోగ్యశ్రీ సేవలు ఆపేస్తామంటూ ఏపీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్(ఆశా) హెచ్చరిస్తున్నది.

● నిర్వహణ భారమై అవస్థలు

ఎన్టీఆర్ వైద్య సేవల నుంచి వచ్చే ఆదాయంతోనే ఎక్కువగా నెట్‌వర్క్ ఆసుపత్రులు ఆధారపడుతున్నాయి. ఒక్కో ఆసుపత్రిలో 20 మందికి పైగా వైద్య నిపుణులతో పాటు 200 మందిగా పైగా సిబ్బంది పనిచేస్తున్నారు. 3254 వైద్య చికిత్సలు అందిస్తున్నారు. అయితే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు బకాయిలు చెల్లించక పోవటంతో వైద్యులు, సిబ్బందికి నెలవారి వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుంది.

బకాయిలు చెల్లించకుంటే కష్టమే



కూటమి ప్రభుత్వం నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించటం లేదు. ఏదో కొద్ది మొత్తంలో మొక్కుబడిగా ఇస్తున్నారేకాని పూర్తిస్థాయిలో చెల్లింపులు లేవు. ఒక్క నెల్లూరు జిల్లాలోనే రూ.150 కోట్లకుపైగా బకాయిలు ఉన్నాయి. ఇలా అయితే వైద్యులు, సిబ్బందికి జీతాలు ఎలా ఇవ్వాలి. ఈ నేపథ్యంలో రాష్ట్ర స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 7న సమ్మెకు వెళ్తాం.

- డాక్టర్ నారాయణరావు, ఆశాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు

డా॥ ఎన్.టి.ఆర్ వైద్యసేవ — పేదలందరికి ఆధునిక వైద్యం



బుచ్చిలో జలమయమైన చెన్నూరు రోడ్డు

‘ఫ్రై’డేలో కూల్!

- జిల్లావ్యాప్తంగా అక్కడక్కడా వర్షం
- చల్లబడిన వాతావరణం

నెల్లూరు (హరనాథపురం)/ అనంతసాగరం/ వెంకటాచలం/ బుచ్చిరెడ్డిపాళెం/ఆత్మకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎండవేడిమితో అల్లాడుతున్న జిల్లాప్రజానీకాన్ని శుక్రవారం కురిసిన అకాలవర్షం సేదతీర్చింది. జిల్లావ్యాప్తంగా అక్కడక్కడా వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి, చల్లనిగాలులు వీచాయి. నెల్లూరు నగరంలోని కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం అర్ధగంటపాటు వర్షం కురిసింది. ముత్తుకూరురోడ్డు, హరనాథపురం, మినీబైపాస్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీళ్లు నిలిచాయి. కాగా, డిసెంబరు 23వ తారీఖున చివరిసారిగా జిల్లాలో వర్షం కురిసింది. తర్వాత నుంచి ఎండలు మండిపోతున్నాయి. ఇప్పుడు వాన కురవడంతో ప్రజానీకానికి ఉపశమనం కలిగినట్టు అయ్యింది. అనంతసాగరంలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్న క్రమంలో వర్షం కురవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. కొందరు పట్టలతో కుప్పగా పోసుకున్న ధాన్యాన్ని భద్రపరుచుకుంటున్నారు. మండలకేంద్రమైన వెంకటాచలంతోపాటు కసుమూరు, పాలిచెర్లపాడు, కురిచెర్లపాడు, ఇస్లాంపేట, చవటపాళెం, కందలపాడు తదితర గ్రామాల్లో వర్షపు జల్లులు కురిశాయి. బుచ్చిరెడ్డిపాళెంలో మధ్యాహ్నం గంటపాటు వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఆత్మకూరులో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండతో అవస్థలు పడిన ప్రజలకు ఆ తర్వాత ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ఉపశమనం కలిగింది.



సీఎం ప్రారంభించి 50 రోజులు పూర్తయినా కందుకూరులో కార్యకలాపాలు ప్రారంభించుకోని ఎంఆర్ఎఫ్ సెంటర్

చెత్త సమస్య..

మళ్లీ మొదటికి!

- సీఎంతో ప్రారంభం.. ఇప్పుడు చేతులెత్తేశారు!
- కందుకూరులో ఎంఆర్ఎఫ్ సెంటర్ వెనక్కు
- ఇక్కడి చెత్తను గుంటూరుకు తరలిస్తారట
- ఇది సాధ్యమయ్యే పనేనా!?
- డంపింగ్‌యార్డు స్థలంలో సుందరపార్కు కలేనా!?

కందుకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) :స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ అధికారుల అనాలోచితం, అత్యుత్సాహం ఇప్పుడు సమస్యగా మారింది. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులమీదుగా కందుకూరులో ప్రారంభించిన మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్ఎఫ్) సెంటర్ మూణ్నాళ్ల ముచ్చటే అయింది. ఎంతో ఆర్భాటంగా కందుకూరులో ఈ సెంటర్ కోసం కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి ఆగమేఘాలమీద పనులు పూర్తిచేసి ఫిబ్రవరి 15న సీఎంతో ప్రారంభింపజేశారు. మార్చి 1 నుంచి కందుకూరులో డంపింగ్‌యార్డుకు ఒక్క పీచు చెత్త కూడా పోదని మొత్తం చెత్తను ఎంఆర్ఎఫ్ సెంటర్‌కు తెచ్చి ప్రాసెస్ చేయనున్నట్లు ప్రకటించారు. ఇక స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ అయితే, కందుకూరులో అనకొండలా పెరిగిపోయిన చెత్తను పరిశీలించి మూడునెలల్లోగా చెత్త మొత్తాన్ని ప్రాసెస్‌చేసి ఈ ప్రాంతాన్ని సుందరపార్కుగా అభివృద్ధి చేస్తామని ప్రకటించేశారు. అయితే, కందుకూరులో ఎంఆర్ఎఫ్ సెంటర్ అర్ధశతదినోత్సవం పూర్తి చేసుకుందే కానీ తన కార్యకలాపాలు మాత్రం ప్రారంభించలేదు. ఇందుకుగల కారణాలను ఆరా తీయగా కందుకూరులో ఎంఆర్ఎఫ్ సెంటర్ వర్కవుట్ కాదన్న అంచనాతో ఆ కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు కందుకూరులోని చెత్తను ప్రతిరోజు గుంటూరులో తాము ఏర్పాటుచేయబోయే అత్యాధునిక ఎంఆర్ఎఫ్ సెంటర్‌కు తరలించి ఇక్కడ ప్రాసెస్ చేసేలా అనుమతించాలని మున్సిపల్ పరిపాలనా శాఖకు ప్రతిపాదించగా అధికారులు ఓకే చెప్పేశారు. 30 టన్నుల చెత్తను ప్రతిరోజు రవాణా చేయగలిగే కంప్రెస్డ్ ట్రక్కును కందుకూరుకు మంజూరు చేస్తామని, ప్రతిరోజు కందుకూరులోని చెత్తను గుంటూరుకు తరలిస్తారని స్థానిక ప్రజాప్రతినిధికి చెప్పగా ఆయన ఓకే చెప్పినట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావే స్వయంగా విలేకరుల సమావేశంలో ప్రకటించారు కూడా. అయితే ఏ పట్టణంలో చెత్తను ఆ పట్టణంలోనే ప్రాసెస్ చేయలేక డంపింగ్‌యార్డులు నిండిపోయి దర్శనమిస్తున్న తరుణంలో కందుకూరులోని చెత్తను గుంటూరు తీసుకెళ్తారా!? అందునా ప్రతిరోజు చెత్తను తీసుకెళ్లటం సాధ్యమయ్యేనా అన్న సందేహాలు మున్సిపల్ పారిశుధ్య అధికారులే వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా సాధ్యమయ్యే పనికాదని కేవలం రీసైక్లింగ్‌కు ఉపయోగపడే విలువకలిగిన మెటీరియల్‌ను మాత్రమే ఎంఆర్ఎఫ్ సెంటర్‌కు తీసుకెళ్తారని మిగిలిన చెత్తను ఇక్కడే వదిలేస్తారని వారు సందేహం వ్యక్తం చేస్తున్నారు. అదే జరిగితే కందుకూరులో డంపింగ్‌యార్డు సమస్య మళ్లీ మొదటికొచ్చినట్లే. డంపింగ్‌యార్డు ప్రాంతం పార్కుగా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్న పట్టణ ప్రజలకు తీవ్ర నిరాశే అవుతుంది.

స్పష్టమైన మార్గదర్శకాలు రాలేదు

మార్చి 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన ఎంఆర్ఎఫ్ సెంటర్ నిర్వాహకులు ఇప్పటికీ ప్రారంభించని మాట వాస్తవం. వారు వస్తారనే మేమూ ఎదురుచూస్తున్నాం. అయితే ఈ సెంటర్‌ను ఇక్కడి నుంచి తీసుకెళ్లనున్నట్లు కానీ కంప్రెస్డ్ వాహనంలో కందుకూరులోని చెత్తను గుంటూరుకు తరలిస్తారని కానీ మాకు అధికారికంగా సమాచారం రాలేదు. ఒకవేళ అలా తరలించాలని నిర్ణయిస్తే కందుకూరులో ప్రతిరోజు 25 టన్నుల చెత్త మాత్రమే వస్తున్నందున మొత్తం చెత్తను తీసుకెళ్తారని భావిస్తున్నాం.

- అనూష, మున్సిపల్ కమిషనర్

దోపిడీ సొమ్మును

కక్కిస్తాం!

- అంతేకాదు.. భోక్తలపై క్రిమినల్ కేసులూ పెడతాం
- వచ్చే మార్చిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి
- వైసీపీ పాలనలో దోపిడీకి గురైన ‘హౌసింగ్’
- అధికారుల సమీక్షలో మంత్రి పార్థసారథి



పొదలకూరు : చిట్టేపల్లి తిప్ప వద్ద నాసిరకంగా ఉన్న పునాదులను పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి, పక్కన ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ‘గత వైసీపీ పాలనలో పేదల ఇళ్లపేరుతో దిగమింగిన వారిందరితో ప్రజాసొమ్మును కక్కిస్తాం. అంతేకాదు.. భోక్తలపై క్రిమినల్ కేసులూ నమోదుచేస్తాం’ అని రాష్ట్ర రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన ఆయన ముందుగా టీపీగూడూరు మండలం వరిగొండలోని గిరిజన గృహాలను, పొదలకూరు మండలం చిట్టేపల్లి తిప్ప వద్ద జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి గృహ నిర్మాణ శాఖ అధికారులతో మంత్రి పార్థసారథి సమీక్షించారు. వైసీపీ నాయకులు, కాంట్రాక్టర్లు కొన్నిచోట్ల ఇళ్లు నిర్మించకనే బిల్లులు తీసేసుకుని తినేశారని మండిపడ్డారు. అమాయకులైన ఎస్సీ, ఎస్టీలను వైసీపీ నాయకులు, కాంట్రాక్టర్లు మోసం చేసి వారి చేత వేలిముద్రలు, సంతకాలు పెట్టించుకుని కనీసం బేస్‌మట్టాలు కూడా వేయకుండానే బిల్లులు వసూలు చేసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కాంట్రాక్టర్లకు అప్పగించి కోట్లాది రూపాయల నిధులను కొల్లగొట్టారని, వారందరిపై క్రిమినల్ కేసులు పెట్టి దోపిడీ సొమ్మును రికవరీ చేసి లబ్ధిదారులకు అందించాలని కలెక్టర్‌ను ఆదేశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలకు ఇస్తున్న రూ.1.80 లక్షలు సరిపోకపోవడంతో దీనిపై ఆలోచన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.3,500 కోట్ల అదనపు భారాన్ని భరిస్తూ ఎస్టీలకు రూ.75 వేల నుంచి రూ.లక్ష, ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు అదనంగా ఇస్తున్నారని, దీంతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునే అవకాశం కలిగిందన్నారు. జిల్లాలో ఆగిపోయిన గృహాలన్నీ వచ్చే ఏడాది మార్చిలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లను థర్డ్‌పార్టీతో పరిశీలించి అవి నివాసానికి అనువుగా ఉంటే కొనసాగించాలని, లేనిపక్షంలో వాటిని కూల్చి పాత కాంట్రాక్టర్లు దిగమింగిన సొమ్మును వసూలు చేసి నూతన నిర్మాణాలను చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేస్తున్న గృహాల్లో ఎక్కువగా నెల్లూరు జిల్లాకు కేటాయించేందుకు కృషి చేస్తానని చెప్పారు. జిల్లాలోని అన్నీ కాలనీల లేఅవుట్లకు జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీరు, విద్యుత్ సౌకర్యాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, పక్కన మరో మంత్రి ఆనం, హౌసింగ్ ఎండీ రాజబాబు, కలెక్టర్ ఆనంద్

● పెంచిన సొమ్ము వివరాలు తెలపడం లేదు : ఎమ్మెల్యేలు

పేదల ఇళ్ల నిర్మాణాలకు సీఎం చంద్రబాబు పెంచిన అదనపు సొమ్ము వివరాలను తమకు తెలియకనే నియోజకవర్గాల్లో లబ్ధిదారులకు అధికారులు మంజూరు చేస్తున్నారని కోవూరు, ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు ప్రశాంతిరెడ్డి, కాకర్ల సురేష్, దగుమాటి వెంకటకృష్ణారెడ్డిలు మంత్రి పార్థసారథి దృష్టికి తెచ్చారు. దీంతో అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేస్తూ అదనపు సొమ్మును చెక్కు రూపంలో స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి అందించాలని ఆదేశించారు.

● లబ్ధిదారులే ఇళ్లు నిర్మించుకోవాలి : ఆనం

దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ హౌసింగ్‌లో అవినీతిపై విజిలెన్స్ విచారణ జరిగిందని, ఇప్పుడు చర్యలు చేపట్టాల్సి వస్తే 75 శాతం మంది అధికారులు, ఉద్యోగులపై వేటు పడుతుందన్నారు. ఇంతమందిపై వేటువేయడం ఇబ్బందికరమని, దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకొంటుందన్నారు. కాంట్రాక్టర్లు కాకుండా లబ్ధిదారుల ద్వారానే ఇళ్లు నిర్మించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకోసం ప్రత్యేకాధికారిని నియమించి ఎమ్మెల్యేలతో కలిసి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించేలా చర్యలు చేపట్టాలన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ కాలనీ లేఅవుట్ల స్థలాల పేరుతో ఒక తట్ట మట్టి తీయకుండానే గత ప్రభుత్వంలో భారీ దోపిడీ చేశారని ఆరోపించారు. బాధ్యులైన కాంట్రాక్టర్లందరిపై కఠిన చర్యలు తీసుకుని లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ కావలిలో ఐదు గ్రామాలను నుడా పరిధిలోకి చేర్చి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనపు సొమ్మును అందించాలని కోరారు. ఈ సమీక్షలో కలెక్టర్ ఆనంద్, హౌసింగ్ ఎండీ పి.రాజబాబు, పీడీ వేణుగోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్, జడ్పీ సీఈవో విద్యారమ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



కలుగోళ్ల శాంభవి ఆలయంలో గోడ మీద అంటించిన నోటీస్ వద్ద దేవదాయ శాఖ ఈవోలు

కావలిలో ఆ మూడు ఆలయాలు

దేవదాయ శాఖ పరిధిలోకి..

కావలి, (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని ప్రధానమైన కలుగోళ్లశాంభవి, విష్ణాలయం, పాతూరు శివాలయాలను దేవదాయశాఖ స్వాధీన పరుచుకున్నట్లు బిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ఈవో రాధాకృష్ణ తెలిపారు. కోవూరు ఈవో కృష్ణప్రసాద్, విడవలూరు ఈవో యానాదయ్య, అల్లూరు ఈవో చిట్టిబాబులతో కలిసి రాధాకృష్ణ శుక్రవారం ఈ మూడు ఆలయాలను కావలి ఒకటోపట్టణ ఎస్ఐ జలీల్ సహకారంతో తనిఖీలు చేశారు. ఆలయ ధర్మకర్త అందుబాటులో లేకపోవటంతో పూజారులతో మాట్లాడారు. దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ ఆలయాలను ఎండోమెంట్ పరిధిలోకి తీసుకుంటున్నట్లు వారికి తెలిపారు. ఈ మేరకు ఆయా ఆలయాల గోడల మీద నోటీస్ బోర్డును అంతికించారు. అలాగే హుండీలకు సీలు వేశారు. ఈ ఆలయాలకు ఇన్‌చార్జిగా బిట్రగుంట ఈవోకు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఎంతోకాలంగా ఆ ఆలయాలను దేవదాయశాఖ స్వాధీనం చేసుకోవాలని కొందరు భక్తులు చేస్తుండిన పోరాటం ఫలించింది.

‘కాకాణి’ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై

విచారణ 7కి వాయిదా



అమరావతి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ వ్యవహారంలో వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌లో శుక్రవారం హైకోర్టులో వాదనలు కొనసాగాయి. కాకాణి తరఫున సీనియర్ న్యాయవాది ఓ. మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నేర ఘటనలో పాల్గొన్నట్లు పిటిషనర్ పై నిర్దిష్ట ఆరోపణలు లేవన్నారు. సాక్ష్యుల వాంగ్మూలం ఆధారంగా పిటిషనర్ పై ఎస్సీఎస్టీ కేసు నమోదు చేశారన్నారు. వాంగ్మూలాన్ని పరిశీలిస్తే పిటిషనర్ ఉద్దేశపూర్వకంగా ఎస్సీ, ఎస్టీలను అవమానించినట్లు, వారి ఆస్తులకు నష్టం చేసినట్లు ఎక్కడా చెప్పలేదన్నారు. ఈనేపథ్యంలో కాకాణిపై ఎస్సీ, ఎస్టీ చట్టంలోని సెక్షన్లు నమోదు చెల్లుబాటు కాదన్నారు. రాజకీయ కారణాలతో కేసు నమోదు చేశారన్నారు. ఎస్సీఎస్టీ సెక్షన్లు వర్తించవని ప్రాథమికంగా నిర్ధారణకు వస్తే ముందస్తు బెయిల్ మంజూరు చేసే అధికారం హైకోర్టుకు ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. అందుకు సంబంధించిన వివరాలను కోర్టు ముందు ఉంచారు. శుక్రవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫు వాదనలు ముగియడంతో పోలీసుల తరఫున ఏజీ వాదనల కోసం విచారణను ఏప్రిల్ 7కి వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పొదలకూరు మండలం వరదాపురంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి, అక్రమంగా క్వార్ట్జ్ ఖనిజాన్ని తవ్వి తరలించారని జిల్లా మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బాలాజీనాయక్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ ఏడాది ఫిబ్రవరి 16న పొదలకూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీనేత కాకాణి గోవర్ధన్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు ఇదే కేసును కొట్టివేయాలని కోరుతూ కాకాణి వేసిన క్వాష్ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఈ రెండు వ్యాజ్యాలు శుక్రవారం మరోసారి హైకోర్టులో విచారణకు వచ్చాయి.

ఫైలేరియా బాధితులకు కిట్ల పంపిణీ

సీతారామపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా మలేరియా అధికారి హేస్సేనమ్మ ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫైలేరియా బాధితులకు కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సీతారామపురం ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 14మంది ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ప్లాస్టిక్ టబ్బు, జగ్గు, ఆయింట్మెంట్లు, టవల్, సోపులు ఉదయగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి షేక్ గాజుల నౌషద్‌బాబు అందజేశారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8652
వెండి కిలో ధర	రూ. 95,500
వెండి ఒక గ్రాము	రూ.98.50

న్యూస్ బాక్స్

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

ఉదయగిరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం, ఉదయగిరి పట్టణంలోని పలు ఆలయాల్లో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. గండిపాళెం జలాశయం సమీపంలో ఉన్న సిద్ధేశ్వరాలయం, దత్తాత్రేయ, ఆభయాంజనేయస్వామి, శ్రీగంగమ్మతల్లి ఆలయాలతో పాటు ఉదయగిరి పట్టణంలోని సంతాన లక్ష్మీ ఆలయాలకు భక్తులు అధికసంఖ్యలో చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. భక్తులు కాయాకర్పూరం అందజేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెన్నాడెల్టాకు నీటి సరఫరా నిలిపివేత

అనంతసాగరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నుంచి పెన్నా డెల్టాకు గత కొన్ని రోజులుగా సరఫరా చేస్తున్న 330 క్యూసెక్కుల ప్రవాహాన్ని శుక్రవారం నిలుపుదల చేసినట్లు అధికారులు తెలిపారు. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 52.924 టీఎంసీలు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

అగ్నిప్రమాదంలో పొగాకు బ్యారన్ దగ్ధం

దుత్తలూరు (ఉదయగిరి), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏరుకొల్లు గ్రామంలో పొగాకు బ్యారన్ దగ్ధమైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దేవరపాటి వెంకట సుబ్బారెడ్డికి చెందిన బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ చేస్తుండగా ఆకురాలి గొట్టాలపై పడడంతో దగ్ధమైంది. బ్యారన్ దగ్ధంతో సుమారు రూ.4 లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. సమాచారం అందుకున్న ఉదయగిరి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

డ్రాపవుట్స్ నివారించాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసులు

ఉదయగిరి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పాఠశాల సముదాయాల పరిధిలో డ్రాపవుట్స్ లేకుండా చూసుకోవాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో శుక్రవారం ఆయన సీఆర్ఎంటీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల్లో జాతీయ పండుగలను తప్పనిసరిగా నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించాలన్నారు. విధుల్లో అలసత్వం వహించకుండా పాఠశాలలను తరుచూ సందర్శిస్తుండాలని సూచించారు.

టవర్ల ఏర్పాటుకు స్థలాల పరిశీలన



దేవమ్మచెరువు వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సీతారామపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నూతనంగా మరో నాలుగు బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో జయపురం, గుండుపల్లి , దేవమ్మచెరువు, చింతోడు గ్రామాల్లో శుక్రవారం మండల అధికారులు పర్యటించి టవర్లకు అనుకూల ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వో బాలు, వీఎస్ ప్రశాంత్ ఉన్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం

ఆత్మకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి నాగజ్యోతికి నిత్య అన్నదాత, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి ఆర్థికసాయం అంద జేశారు. ఆ చిన్నారి చదువుకునేందుకు తన వంతుగా ఏడాదికి రూ. 12వేలు అందజేస్తానని తెలిపారు. ఆ చిన్నారి ఉజ్వల భవిష్యత్‌కు తమ ట్రస్ట్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

పుట్టగొడుగుల్లా మినరల్ వాటర్ ప్లాంట్‌లు

● ప్రమాణాలు పాటించని నిర్వాహకులు ● పట్టించుకోని అధికారులు

సీతారామపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో మినరల్ వాటర్ ప్లాంట్‌లు పుట్టగొడుగుల్లాగా పుట్టుకొస్తున్నాయి సరఫరా చేస్తున్న తాగునీరు సురక్షి తమో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఆయా వాటర్ ప్లాంట్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాల్సిన అధికారులు తనిఖీలు చేయకపోవడంతో నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని వాటర్ ప్లాంట్‌లలో ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రజలు నోరుపూత తదితర సమస్యలతో బాధపడుతున్నారు. పెద్దలకు కీళ్లనొప్పులు, అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. తాగునీటి సరాఫరా సక్రమంగా లేకపోవడంతో నీటిని కొనుక్కొని తాగాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, వాటర్ ప్లాంట్ వద్ద 20 లీటర్ల క్యాన్‌కు రూ. 10 వసూలు చేస్తున్నారు. ప్రతి గ్రామంలో మినీ ఆర్వో ప్లాంట్‌లు ఏర్పాటుచేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటర్‌ప్లాంట్‌లను తనిఖీచేసి స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



అనుమతులు లేకుండా నెలకొల్పిన వాటర్ ప్లాంట్

వైభవంగా సీతారాముల శాంతి కల్యాణ మహోత్సవం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండ రామస్వామి ఆలయంలో శుక్రవారం సీతారాముల శాంతి కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. కదిరి వంశస్తుల దాతృత్వంతో అందజేసిన నూతన ఉత్సవ విగ్రహాల సంప్రోక్షణ, కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా చివరిరోజు భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. తొలుత వేద పండితులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.



వరికుంటపాడు (ఉదయగిరి రూరల్): కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

నేటి నుంచి నవమి వేడుకలు

కాగా, శనివారం నుంచి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఉభయులవారీగా పది రోజులపాటు ఉత్సవాలను నిర్వహించేందుకు అన్నిరకాల వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

రేపు సీతారాముల కల్యాణోత్సవం

● ఉదయగిరి : పట్టణంలోని సుద్ధబావి వీధిలో ఉన్న సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కల్యాణోత్సవం, వసంతోత్సవం, భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆయన సతీమణి ప్రవీణలు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

అశ్లీల నృత్యాలు నిషేధం

● ఆత్మకూరు : జిల్లా ఎస్పీ జి కృష్ణకాంత్ ఆదేశాల మేరకు శ్రీరామనవమి ఉత్సవాల్లో అనుమతులు లేకుండా సాంస్కృతిక కార్యక్రమాలు, అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డాన్స్‌లు వంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని సీఐ జి గంగాధర్ తెలిపారు. అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. శ్రీరామనవమి పర్వదినాన్ని ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు.

పీఎంశ్రీ నిధులతో పాఠశాలల్లో క్రీడా మైదానాలు



కబడ్డీ కోర్టుకు చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

సంగం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ నిధులతో క్రీడా మైదానాలు సిద్ధం చేస్తున్నారు. ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 486 మంది విద్యార్థులున్నారు. పాఠశాలలో చాలీచాలని క్రీడామైదానం ఉంది. అయినా విద్యార్థులు ఆడుకునేందుకు ఏ ఒక్క కోర్టు అందుబాటులో లేదు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పాఠశాలను పీఎంశ్రీ పథకంలో ఎంపికచేశారు. దీంతో నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో ఇప్పటికే కోకో కోర్టు ఏర్పాటుచేశారు. రెండవది కబడ్డీ కోర్టు సిద్ధం చేస్తున్నారు. తరువాత వాలీబాల్ కోర్టు చేస్తామని పీడీ అంజయ్య తెలిపారు.

చెరువు ఆక్రమణల పరిశీలన

వింజమూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని వింజమూరు మండలం కాటేపల్లి గ్రామానికి చెందిన కొందరు పీజీఆర్ఎస్ కింద ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు కావలి ఆర్డీఓ వంశీకృష్ణ కాటేపల్లి గ్రామానికి చేరుకుని రెవెన్యూ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖకు సంబంధించిన భూములు, చెరువులు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ రామకృష్ణ, దేస్‌నాయక్, ఖాన్, రెవెన్యూ శాఖ సిబ్బంది, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ



మద్యం స్టాక్ రిజిస్టర్లను తనిఖీచేస్తున్నఎక్సైజ్ సీఐ

సీతారామపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మద్యం దుకాణాలను ఎక్సైజ్ సీఐ లక్ష్మణస్వామి శుక్రవారం తనిఖీ చేశారు. మద్యం స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసి నిల్వలను పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే అధికంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణాల నిర్వహణలో సమయాన్ని పాటించాలన్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ లక్ష్మణస్వామి మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కలువాయి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాబోయే రెండు, మూడు రోజుల పాటు వరి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి వి ప్రతాప్ సూచించారు. ఉరుములతో కూడిన వడగండ్ల వర్షాలు పడే అవకాశం ఉండటంతో రెండు, మూడు రోజులు రైతులు వరి కోతలు నిలిపివేయాలని, కళ్ళాలలో ధాన్యం ఉన్న రైతులు నల్లపట్టలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కాగా, కలువాయిలో శుక్రవారం పంట దిగుబడిపై ప్రయోగం నిర్వహించారు. ఏకరాకు 3.5 పుట్లు ధాన్యం దిగుబడి వస్తుందని ఈ ప్రయోగం ద్వారా వ్యవసాయశాఖ సిబ్బంది అంచానా వేశారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

సంగం, ఏప్రిల్ 4 (ఆంధ్ర జ్యోతి): స్థానిక సాయినగర్‌లో రూ. 15 లక్షల ఉపాధి హామీ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. స్థానిక మండల పార్టీ కన్వీనర్ గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాణా శ్రీనివాసులురెడ్డి, కాకు మధుసూదన్‌యాదవ్, కె శ్రీనివాసులు చౌదరి, ఎన్ శ్రీనివాసులునాయుడు, వెంకటేశ్వర్లు యాదవ్, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సుల్తాన్ షాహిద్ దర్గాలో మౌలిక వసతులు కల్పించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఆవాజ్ కమిటీ నాయకులు, ముస్లింలు

ఆత్మకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుల్తాన్ షాహిద్ దర్గా, శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించాలని మండల ఆవాజ్ కార్యదర్శి పి యస్థానీ కోరారు. శుక్రవారం ఆవాజ్ ఆధ్వర్యంలో పలువురు ముస్లింలు దర్గా ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటికలో ఏళ్ల తరబడి నిల్వ ఉన్న చెత్తను, ముళ్లకంపను తొలిగించాలని, అంతర్గత రోడ్లు, నూతనంగా మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. గత 12 ఏళ్లుగా వక్ఫ్‌బోర్డు రూములు, హుండీ ద్వారా వస్తున్న ఆదాయం వివరాలు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని, ఆవాజ్ మండల కమిటీ సభ్యులు షేక్ సందాని, పి మస్తాన్, షేక్ ఖలీల్, షేక్ రిజ్వాన్, షేక్ సుల్తాన్‌బాష, షేక్ చాంద్‌బాష పాల్గొన్నారు.

నాసా స్పేస్ కాంటెస్ట్‌లో వింజమూరు విద్యార్థుల ప్రతిభ



నాసా స్పేస్ కాంటెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

వింజమూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అమెరికా నాసా ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్ 2025 లో శ్రీచైతన్య స్కూల్ వరుసగా 13వసారి విజయ దుంధుభి మోగించింది. ప్రపంచ వ్యాప్తంగా 25 దేశాలు పాల్గొన్న ఈపోటీల్లో ఇండియాకు మొత్తం 60 అవార్డులు రాగా అందులో 3 అవార్డులు శ్రీచైతన్య విద్యార్థులే సాధించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల డైరెక్టర్ సీమ మాట్లాడుతూ వరుసగా మూడోసారి కూడా శ్రీచైతన్య స్కూల్ అవార్డులను గెలుచుకోవడం గర్వకారణమన్నారు. ఈ ప్రాజెక్టులో పాల్గొన్న విద్యార్థులకు నెల్లూరుజిల్లా ఏజీఎం కొండారెడ్డి, కోఆర్డినేటర్ బాషా, నాగరాజు మెడల్స్, మెమోంటోలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వింజమూరు శ్రీచైతన్య ప్రిన్సిపాల్ మమత, మస్తాన్, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జ్‌లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

పంట కుంటలతో సాగునీటి సమస్య పరిష్కారం



బూదవాడలో కుంట తవ్వుతున్న కూలీలు

మర్రిపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంత చిన్న, సన్నకారు రైతులకు సాగునీటి సమస్యల పరిష్కారం కోసం పంట సంజీవిని పేరుతో పొలాల్లో కుంటల తవ్వకాలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. సాగు నీటితో పాటు మూగజీవాలకు తాగు నీరు అందుబాటులో ఉంటుంది. మర్రిపాడు మండలంలో 480 పంట కుంటలు తవ్వించాలని జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. కాగా, తమ పొలంలో భూమి వృథాగా పోతుందని ఎక్కువ మంది రైతులు ముందుకు రావట్లేదు. ఐదెకరాల పొలం ఉన్న వారు ఈ కుంట తవ్వించుకునేందుకు అర్హులు. వారికి అనువైన చోట తవ్వించుకోవచ్చు. అందుకు ఉపాధి కూలీలకు 100రోజుల పనిదినాలు పూర్తికి అవకాశం ఉంటుంది. ఒక్కో గుంతకు రూ. 50వేలు కేటాయించారు. ఆ రైతుకు కూరగాయల విత్తనాలు, పండ్ల మొక్కలు వంటివి ఉచితంగా అందిస్తుండటంతో అదనపు ఆదాయాన్ని పొందవచ్చు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తా



అనంతలక్ష్మిని సన్మానిస్తున్న ఎంఈవో-2 చలపతి, ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది

ఆత్మకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఎంఈవో -1గా సీహెచ్ అనంతలక్ష్మీ శుక్ర వారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 చలపతి, పలువురు ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు.

CRIME NEWS

తగ్గేదేలా..!

● పేట్రేగుతున్న ఇసుకాసురులు
● మొన్న రాజుపాళెం.. ఇప్పుడు తెలుగురాయపురంలో అక్రమ రీచ్‌లు
● భారీ వాహనాలతో రేయింబవళ్లు ఇసుక తరలింపు
● అన్నీ తెలిసినా కళ్లు మూసుకుంటున్న అధికారులు



తెలుగురాయపురం అక్రమ రీచ్‌లో టిప్పర్‌కు ఇసుక లోడ్ చేస్తున్న యంత్రం

కలువాయి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కలువాయి మండలంలో ఇసుకాసురులు తగ్గనంటున్నారు. పెన్నానదిలో ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన అక్రమ రీచ్‌ల నుంచి యంత్రాలతో ఇసుక తవ్వి, భారీ వాహనాలతో తరలిస్తున్నారు. కొంతకాలంగా రాజుపాళెం సమీపంలోని రీచ్ నుంచి ఇసుక తరలిస్తుండగా తాజాగా వారం రోజుల నుంచి తెలుగురాయపుం వద్ద మరో అక్రమ రీచ్ తెరిచారు. ఈ రెండు రీచ్‌ల నుంచి అడ్డూ, ఆపూ లేకుండా రేయింబవళ్లు ఇసుకను తోడేసి సరిహద్దులు దాటించేస్తున్నారు. ఒక్కో లారీ ఇసుక రూ.10-15వేల వరకు అమ్ముకుంటున్న అక్రమార్కులు రూ.లక్షల్లో జేబులు నింపుకుంటున్నారు. తెలుగురాయపురం రీచ్ నుంచి ఇసుక వాహనాలు కలువాయి తహసీల్దారు కార్యాయలయం ముందు నుంచే వెళ్తున్నా అధికారులు మాత్రం కన్నెత్తి చూడటం లేదు.

● 4 రోజుల్లోనే తెరుచుకున్న గేట్లు

రాజుపాళెం రీచ్‌లో అక్రమార్కులు ఏకంగా నదిలోకి సుమారు కిలోమీటరు పొడవున రోడ్డు నిర్మించేశారు. దీనిపై గత నెల 21వతేదీ ఆంధ్రజ్యోతిలో ఓ కథనం కూడా ప్రచురితమైంది. ఆ మరుసటి రోజు తహసీల్దారు శ్యామ్‌సుందర్‌రాజు స్పందించి ఈ అక్రమ రీచ్‌ను మూసి వేసినట్లు ప్రకటించారు. ఈ మేరకు రెవెన్యూ సిబ్బంది రీచ్‌లోనికి వెళ్లే గేటుకు తాళం వేశారు. అయితే, సరిగ్గా నాలుగు రోజులు గడవక ముందే ఏం జరిగిందో ఏమో మళ్లీ రీచ్ గేట్లు తెరుచుకున్నాయి. ఈ వ్యవహారం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

● మైనింగ్ వాళ్లకు చెప్పండి!

తెలుగురాయపురం, రాజుపాళెం వద్ద ఎలాంటి రీచ్‌లకు అనుమతులు లేవు. చర్యలు తీసుకునేందుకు మాకు అధికారం లేదు. కాబట్టి మైనింగ్ వాళ్లకు చెప్పండి. వాళ్లు చర్యలు తీసుకుంటారు.

\- శ్యామ్‌సుందర్‌రాజు, తహసీల్దారు

20 కిలోల గంజాయి స్వాధీనం

● వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద తనిఖీల్లో పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నెల్లూరు(క్రైం),ఏప్రిల్ 4 (ఆంధ్ర జ్యోతి):విశాఖపట్నం నుంచి మధురైకి ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న 20కిలోల200గ్రాముల గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకుని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్ విలేకర్లకు వెల్లడించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పీ.జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం తనిఖీలు చేపట్టారన్నారు. ఆర్టీసీ బస్సులో అనుమానాస్పదంగా ఉన్న సుందర్‌పాండి, నేతాజీ, కుమార్ అనే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి లగేజీ బ్యాగులు తనిఖీ చేశారన్నారు. అందులో మూడు ప్యాకెట్లలో 20కేజీల 200 గ్రాముల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారన్నారు. వారిని విచారించగా దీనిని విశాఖపట్నంలో హనుమాన్ అనే వ్యక్తి నుంచి రూ.90వేలకు కొనుగోలు చేసి మూడు బ్యాగుల్లో మధురైకి తరలిస్తున్నట్లు తెలిపారన్నారు. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ముగ్గురు నిందితులను ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు ఎస్‌డీ కాలేషావలి, సీహెచ్ పూర్ణకుమార్, సిబ్బంది శ్రీనివాసులు, రమణయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం

బిట్రగుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప జాతీయ రహదారిపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల సమీపంలోని డివైడర్ మధ్య శుక్రవారం గుర్తుతెలియని (30) వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు తిప్ప ఎస్ఐ భోజ్యా తెలిపారు. మృతదేహ పరిస్థితిని చూస్తే రోడ్లపై తిరిగే వ్యక్తిలా ఉన్నాడని చెప్పారు. మృతదేహంపై స్వల్ప గాయాలు ఉన్నాయని, గుర్తుతెలియని వాహనం ఢీకొని ఉండొచ్చనే అనుమానం వ్యక్తం చేశారు. వీఆర్వో హరిబాబు ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

నాణ్యమైన పొగాకుకు మద్దతు ధర ఇవ్వాలి

కలిగిరి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన నాణ్యమైన పొగాకుకు మద్దతు ధర అందించాలని పొగాకు రీజనల్ మేనేజర్ ఎం.లక్ష్మణరావు పొగాకు కొనుగోలు కంపెనీ ప్రతినిధులకు సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన రైతులతో పొగాకు ధరల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది వాతవరణ పరిస్థితులు అనుకూలించడంతో నాణ్యమైన పొగాకు దిగుబడి వచ్చిందని, ధరలు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని బోర్డు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్ కుమార్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కిలో పొగాకు రూ.281

స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 430 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో ఏడు కంపెనీ ప్రతినిధులు పాల్గొని 263బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-150, ఆర్ఆర్-2, సీఆర్-10, జంపింగ్‌లాట్స్-5 కారణాలతో 167బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.281, కనిష్ఠ ధర రూ.230, సగటు ధర రూ.265.78గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.



పొగాకు వేలంను పరిశీలిస్తున్న ఆర్ఎం లక్ష్మణరావు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	113
స్కిన్ చికెన్	202
స్కిన్‌లెస్	226

కోడిగుడ్ల ధర (100): 430



వాహనానికి పెట్రోల్ పడుతున్న ఎమ్మెల్యే సురేష్

ఖాతాదారులకు సౌకర్యాలు కల్పించండి : ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకు యజమానులు ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించడంతోపాటు బంకుల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. కలిగిరి-కొండాపురం రహదారిలో నూతనంగా ఏర్పాటైన పెట్రోల్ బంకును శుక్రవారం కాకర్ల దంపతులు ప్రారంభించారు. కొన్ని వాహనాలకు ఎమ్మెల్యే పెట్రోల్ పట్టారు. కార్యక్రమంలో నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, బీవీ రామారావు, చీమల తాతయ్య, బాసం నరసింహులునాయుడు, దామా మహేశ్వరరావు, కట్టా వెంకటేశ్వర్లు, కర్నాటి ప్రభాకర్, గన్నమనేని శ్రీనివాసులు, మాదాల శ్రీనివాస్, లెక్కల రాంబాబు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మంచినీటి పథకం నీరు నిలుపుదల

లింగసముద్రం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సుమారు 48 గ్రామాల ప్రజలకు తాగునీటిని అందించే రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకం నుంచి అధికారులు రెండు రోజుల పాటు నీటిని నిలిపివేశారు. ఈ పథకానికి చెందిన పెంట్రాల, జంగంరెడ్డిపాలెం, బంగారక్కపాలెంలలోని సంపులను సిబ్బంది కడిగి శుభ్రం చేస్తున్నారు. శనివారం ఉదయం ఈ పథకం నుంచి నీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు

కావలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఒంగోలు బస్టాండ్ ప్రాంతంలో వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. కావలి వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు నాగరాజు. మండల వ్యవసాయాధికారి లలితలు చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల అధ్యక్షుడు బచ్చు ఏడుకొండలరావు, ఉపాధ్యక్షులు నేరెళ్ల జ్వాలాసుబ్బారావు, సభ్యులు పేరూరు శివప్రసాద్, నాగమోహన్‌రావు, వెల్లంపల్లి మోహన్‌రావు సురే క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో...

అల్లూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణదారుల ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాదాచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో దుకాణ వ్యాపారులు అంబటి రాజేంద్ర, పాపారావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ

కావలిటౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంగళరావునగర్‌లోని సంయుక్త సేవాసంస్థ సభ్యులు కార్యాలయంలో శుక్రవారం వృద్ధులకు చీరలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు సురేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జేబి విశ్రాంత అధ్యాపకురాలు జార్జినా అతిథిగా పాల్గొని మాట్లాడారు. కుటుంబసభ్యులు కె.సోమరాజు జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

బాలికలకు దుస్తులు..

కావలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు మిండి శ్రీనివాస్, రమాదేవిల కూతురు జ్యోతిర్మయ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం తల్లిదండ్రులు లేని 20 మంది బాలికలకు దుస్తులు పంపిణీ చేశారు. అలాగే శ్రీనివాస సౌజన్యంతో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళకలు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మాధవి మాట్లాడారు. శిక్షణపొందిన మహిళలతో బాలికలకు దుస్తులు కుట్టించి ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీవీపీ అంజనీ కుమారి, నాగరాజు సింగ్, శారద తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

- వ్యవసాయ అధికారి లలిత

కావలి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు అందించే సంక్షేమ పథకాలపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని మండల వ్యవసాయశాఖ అధికారి లలిత శుక్రవారం తెలిపారు. ఈ విషయంపై స్థానిక కార్యాలయంలో మాట్లాడారు. మండలంలోని ప్రతిరైతు తప్పనిసరిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధికి విశిష్ట సంఖ్యను నమోదు చేయించుకోవాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటే పంటలకు నష్ట పరిహారం, రాయితీపై ఎరువులు విత్తనాలు, రైతుభరోసా వంటి అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ఈ విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను గత నెలలో ప్రారంభించి 50శాతం లక్ష్యాలకు చేరుకున్నట్లు తెలిపారు. ప్రతి రైతుకు అవగాహన కల్పించి త్వరలో 100 శాతం లక్ష్యాలకు చేరుకుంటామని చెప్పారు.

రీ సర్వేపై అవగాహన అవసరం

బిట్రగుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ రీ సర్వేపై రైతులకు అవగాహన అవసరం అని మండల తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. బోగోలు మండలం అల్లిమడుగు, బిట్రగుంట రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వేపై నిర్వహించిన గ్రామసభలు ఏర్పాటు చేసి అనంతరం స్థానిక రైతులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శ్రీరామ్ గోపాల్, మండల సర్వేరు వెంకటేశ్వర్లు, ఆర్టై రామకుమారి, వీఆర్వోలు, విలేజ్ సర్వేర్లు, టీడీపీ మండల కన్వినర్ నాగేశ్వరరావు, నేతలు వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, పద్మారెడ్డి, వెంకారెడ్డి సురేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలి

సబ్ కలెక్టరు శ్రీపూజ



కందుకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేపట్టాలని కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ ఉపాధ్యాయులకు సూచించారు. పట్టణంలోని అమలనాథునిపాలెం ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ఉన్నత చదువులు చదివి సమాజ హితానికి దోహదపడాలని ఉద్బోధించారు. ఈ సందర్భంగా 20 మంది విద్యార్థులకు ఆధార్ లేదని తెలుసుకున్న ఆమె తక్షణం తగుచర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కే అనూషకు సూచించారు. పాఠశాల తరగతి గదులను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కె సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుకిరువైపులా కార్ల పార్కింగ్

వాహన రాకపోకలకు ఇబ్బంది

కావలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కో ఆపరేటివ్ కాలనీ మెయిన్ రోడ్డుకి ఇరువైపుల ఏర్పాటు వాహనాల పార్కింగ్‌తో స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులన్నీ క్రిష్టియన్‌పేటలో ఉన్నాయి. అలాగే కో ఆపరేటివ్ కాలనీలో మూడు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆ రోడ్డు వెంబడి రొయ్యలమేత దుకాణాలు వెలిశాయి. ఈ రోడ్డు నిత్యం రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అలాంటి రద్దీ రోడ్డులో ట్రంకురోడ్డు నుంచి క్రిష్టియన్‌పేట మొదటి లైను వరకు రోడ్డుకి ఇరువైపులా ట్యాక్సీలు నడుపుకునేవారు వాహనాలను పార్కింగ్ చేయడం తగదు. దీనికి రోడ్డు వెంబడి ఉన్న దుకాణదారులు తమ నాలుగు చక్రాల వాహనాలను రోడ్డు మీద పార్కింగ్ చేస్తారు. కళాశాలు వదిలిన సమయంలో ఆ రోడ్డుపై ఎదురెదురుగా వాహనాలు వస్తే గంటల తరబడి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే రోగులు ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ఆ రోడ్డులో వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కోఆపరేటివ్ కాలనీ మెయిన్ రోడ్డుకు ఇరువైపులా నిలిపిన కార్లు

తగ్గిన ధరలతో దిగాలు

- ధాన్యం కొనుగోళ్లు లేక రైతులు లబోదిబో
- అన్నదాతను ఆదుకోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- అల్లాడుతున్న మెట్ట ప్రాంతవాసులు

అసలే మెట్టప్రాంతం. అంతంతమాత్రంగా పండిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు పడుతున్న వేదన వర్ణనాతీతం. మార్చి నెలాఖరులో ప్రైవేటు మిల్లర్లు ధాన్యం కొనుగోళ్లను నిలుపుదల చేశారు.అంతకుముందు 15 రోజుల నుంచి ధరలు పూర్తిగా తగ్గిపోయాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుందామంటే అక్కడ పూర్తిస్థాయిలో కొనుగోళ్లు జరగడంలేదు. దిగుబడి ధాన్యం ఎవరికి, ఎక్కడ అమ్ముకోవాలో తెలియక మెట్టరైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కొండాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కొండాపురం మండల పరిధిలోని సాయిపేట, భీమవరప్పాడు, కొమ్మి, సత్యవోలు, గానుగపెంట, శెట్టిపాలెం, గుడవ ళ్లూరు, నేకునాంపేట, రేణమాల, మర్రిగుంట, వెళిగండ్ల, తూర్పు ఎర్రబల్లి, గొట్టిగుండాల తదితర గ్రామాల్లో ఈ ఏడాది భారీగానే వరి సాగు చేశారని వ్యవసాయాధికారులు తెలిపారు. ఫిబ్రవరి నుంచి కోతలు మొదలవగా, మొదట్లో మిల్లర్లు 75 కేజీల బస్తాను రూ.1,700 పైగానే కొనుగోలు చేశారు. దీంతో రైతులు మిల్లర్లకే ధాన్యాన్ని అమ్ముకున్నారు. మార్చి నెల సగం వరకు ఈవ్యవహారం సజావుగా సాగింది. ఇటీవలే కొనుగోళ్లు మందగించాయి. ధరలు పూర్తిగా పడిపోయాయి. ఆర్ఎన్ఆర్(షుగర్‌లెస్) రకం ధాన్యం 75 కేజీల బస్తా రూ.1550 నుంచి రూ.1,600 వరకు, కేఎన్ఎం రకం ధాన్యం 75 కేజీల బస్తా రూ.1,550కు కొనుగోలు చేస్తున్నారు. అదీ కూడా రైతులు దళారులను బతిమలాడి అమ్ముకోవాల్సిన దుస్థితి. దీంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారు.

● అరకొరగా సేకరణ

మండలంలోని సాయిపేట, కొమ్మి, గరిమెనపెంట గ్రామాల్లో వ్యవసాయాధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మూడు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 400 మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో సూచించిన నాణ్యతా, ప్రమాణాల ప్రకారం ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలంటే పట్టలు, కూలీలు దొరక్కపోవడంతోపాటు ఆరబెట్టుకునేందుకు స్థలం కూడా లేదని రైతులు అంటున్నారు. దీనికితోడు ఆరబెట్టిన ధాన్యాన్ని 40 కేజీల బస్తాల్లో కూలీలతో కాటా వేయించాల్సి ఉంది.షెడ్యూల్ నిర్ణయించిన తరువాత బస్తాలను ప్రభుత్వమే రైతులకు ఇవ్వాల్సి ఉన్నా, ఆశించిన స్థాయిలో గోతాలు ఆయా కేంద్రాల వద్ద లేవు. దీంతో రైతే బస్తాలను కొనుగోలు చేసి కాటా వేయించాల్సి వస్తుంది. బస్తాలను కొనుగోలు చేసిన నగదు ప్రభుత్వం ఇస్తున్నా, మార్కెట్ రేటును చెల్లించలేదని రైతులు అంటున్నారు. ఈవ్యవహారం ఇబ్బందిగా ఉండటంతో అన్నదాతలు దళారులకు తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



పొలాల్లోనే ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు



లారీకి ధాన్యం లోడు చేస్తున్న కూలీలు

ప్రభుత్వమే ఆదుకోవాలి



తనకున్న పొలంతోపాటు మరి కొంత పొలాన్ని కౌలుకు తీసుకొని 8 ఎకరాల వరకు సాగుచేశా. గిట్టుబాటు ధర దక్కడంలేదు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో అరకొరగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వమే మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

- ఎం. ప్రసాదు, రైతు, సాయిపేట

రైల్వే అండర్‌పాస్ నిర్మాణంపై కదిలిన అధికార యంత్రాంగం

- సుబ్బరాయుడిసత్రం గ్రామస్థులతో చర్చలు

ఉలవపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థుల నిరసనలతో నిలిచిన రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలు పెట్టాలనే ఉద్దేశ్యంతో శుక్రవారం అధికార యంత్రాంగం సుబ్బరాయుడుసత్రం గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఇరిగేషన్ ఏఈ సీతారామయ్య, రైల్వే అధికారులు అండర్‌పాస్ బ్రిడ్జి విషయంలో గ్రామస్థులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు ప్రయత్నం చేశారు. కాగా, సుబ్బరాయుడు సత్రం గేటుకి కూతవేటు దూరంలో కట్టిన బ్రిడ్జి, చాగొల్లు వద్ద కట్టిన బ్రిడ్జిల పరిస్థితి చూస్తున్నామని, వర్షాకాలంలో కురిసిన నీరు ఇప్పటికీ నిలిచే ఉన్నాయని, అలాంటి అవస్థలు మాకొద్దని గ్రామస్థులు తెగేసి చెప్పారు. వర్షపు నీరు నిలవకుండా సెన్సార్ మోటార్లు ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు నీళ్ల తోడే విధంగా చర్యలు తీసుకుంటామని రైల్వే అధికారులు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. పైఎత్తున పడిన వర్షపు నీరు, వరదలు దిగువన మా గ్రామంలోకి వచ్చే అవకాశం లేకుండా రైలుకట్ట అడ్డంగా ఉందని, అండర్‌పాస్ బ్రిడ్జి కడితే వరద నీళ్లతో గ్రామం, పంట పొలాలు, పండ్ల తోటలు మునిపోతాయని గ్రామస్థులు సబ్‌కలెక్టర్‌కు వివరించారు. కాగా, గ్రామస్థుల అభ్యంతరాలపై స్పందించిన సబ్‌కలెక్టర్ వర్షాలకు చెరువులు, కాలువల వలన గ్రామం వైపు వరద నీరు ప్రవహించే అవకాశాలు ఎంతమేరకు ఉన్నాయో పరిశీలించి నివేదిక సమర్పించాలని ఇరిగేషన్ ఏఈ సీతారామయ్యను ఆదేశించారు. అన్ని అంశాలు పరిశీలించి అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం అవకాశాలపై ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు సబ్‌కలెక్టర్ తెలిపారు.

క్యాన్సర్ బాధిత బాలుడి చికిత్సకు బెస్ట్ వాకర్స్ రూ.30వేల సాయం

కావలి టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న పేపర్లవారిపాలెం గ్రామానికి చెందిన 4ఏళ్ల బాలుడు చలంచర్ల అఖిల్ చికిత్సకు చేయూతనందించి మానవత్వం చాటుకున్నారు బెస్ట్ వాకర్స్ సభ్యులు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా బెస్ట్ వాకర్స్ అధ్యక్షుడు టీవీ శేషయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాలుడి తండ్రి చేతికి రూ.30వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా శేషయ్య మాట్లాడారు. ప్రతినెలా క్ర మం తప్పకుండా చేసే సేవా కార్య క్రమంలో భాగంగా బాలుడికి తమవంతు సాయం చేశామన్నారు. కార్యక్రమంలో బెస్ట్ వాకర్స్ ఉపా ధ్యక్షులు రమేష్, మందా వెంకటేశ్వర్లు, హరి, సుంకు కృష్ణ, క్లాత్ శీను, హెడ్ కానిస్టేబుల్స్ శ్రీను, కుమార్, బాస్కర్ నాయుడు, ఆర్టీసీ బాష, కోటి తదితరులు పాల్గొన్నారు.



అఖిల్ తండ్రికి నగదు అందిస్తున్న బెస్ట్ వాకర్స్ సభ్యులు

బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక



అధ్యక్షుడు శ్రీధర్‌నాయుడు



కార్యదర్శి పవన్‌కుమార్

కందుకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కందుకూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వలేటి శ్రీధర్‌నాయుడు, కార్యదర్శిగా శింగరాజు పవన్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీనియర్ న్యాయవాది తల్లపనేని గోపాలకృష్ణ అధ్యక్షతన శుక్రవారం జరిగిన బార్ అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంయుక్త కార్యదర్శిగా సీహెచ్ రవీంద్రనాథ్, లైబ్రేరియన్‌గా సింహాద్రిలను ఎన్నుకున్నారు. కాగా, రెండవసారి అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీధర్‌నాయుడు, ఇతర కార్యవర్గ సభ్యులకు సీనియర్ న్యాయవాదులు కేవీ లక్ష్మీనారాయణ, బెజవాడ కృష్ణయ్యచౌదరి, సన్నెబోయిన శ్రీనివాసులు, బీవీ మురళీకృష్ణ, సీహెచ్ హరికృష్ణ, ప్రసాదరెడ్డి, భాస్కరరావు, తదితరులు అభినందనలు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఉలవపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై అంకమ్మ అందించిన వివరాల ప్రకారం.. కరేడు పంచాయతీ పరిధిలోని చైతన్య నగర్‌కు చెందిన సింగోతు శ్రీను (28) తన స్నేహితులతో కలిసి స్థానిక హైస్కూల్ వద్ద గురువారం రాత్రి 8గంటల సమయంలో మాట్లాడుకుంటున్నారు. అనంతరం అక్కడనుంచి కొత్తపల్లెపాలెం గ్రామం వెళ్లేందుకు తన స్నేహితుడి ద్విచక్ర వాహనంపై ఎక్కే క్రమంలో అదే రోడ్డుపై వెళుతున్న ట్రక్‌ఆటో వెనుక నుంచి ఢీకొంది. దీంతో శ్రీను స్పృహ కోల్పోవడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు గుంటూరు కార్పోరేట్ హాస్పిటల్‌కి తరలించగా పరిశీలించిన వైద్యులు చికిత్స అందించారు. ఎంత ప్రయత్నించినప్పటికీ చికిత్సకు స్పందించకపోవడంతో బతకడం కష్టమని చెప్పారు. దీంతో గత్యంతరం లేక శుక్రవారం తెల్లవారుజామున ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చె క్రమంలో ఉలవపాడుకు చేరుకునే సరికి శ్రీను మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటరమణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉలవపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.



శ్రీను మృతదేహం

రీసర్వేతో భూసమస్యల పరిష్కారం

తహసీల్దార్ సీతామహాలక్ష్మి ● పలు మండలాల్లో సర్వే, గ్రామసభలు

లింగసముద్రం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రీసర్వేతో రైతుల భూముల సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ ఎస్ సీతామహాలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని మొగిలిచెర్ల పంచాయతీ నారసింహాపురం, పెంట్రాల పంచాయతీలోని చీమలపెంటలో భూముల రీసర్వే ప్రారంభించారు. తహసీల్దార్, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన గ్రామ సభల్లో తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వేతో ఎలాంటి తప్పొప్పులు జరగవని, రైతులు తమ భూములకు చెందిన పట్టాదారు పాస్ పుస్తకాలు, 1బి అడంగలు పత్రాలను అందజేయాలని, రీసర్వే అధికారులకు రైతులు సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎం రమణయ్య, వీఆర్వోలు సర్వేయర్లు పాల్గొన్నారు.



లింగసముద్రం : ర్యాలీలో తహసీల్దార్, అధికారులు

● సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

గుడ్లూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ విజయభాస్కర్ అన్నారు. వివిధ రకాల భూసమస్యల పరిష్కారాల కోసం గుడ్లూరు సచివాలయ కేంద్రం - 2 వద్ద రెవెన్యూ అధికారులతో గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభలో 15 అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు చలమారెడ్డి, తిరుపాలు, వీఆర్ఏ నరసింహం సచివాలయ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

● సమస్యలు లేని రికార్డుల కోసమే..

అల్లూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సమస్యలు లేకుండా శాశ్వత హక్కు పొందేలా వెబ్‌ల్యాండ్‌లో భూ రికార్డు పొందేందుకే రీసర్వే ప్రక్రియ దోహదపడుతుందని తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలోని సింగపేటలో రీసర్వే ప్రక్రియను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండలంలో అత్యధిక విస్తీర్ణం కలిగిన అల్లూరు, సింగపేట గ్రామాలకు రీసర్వే చివరి విడతలో చేపడతామన్నారు. తక్కువ విస్తీర్ణాలు కలిగిన గ్రామాల్లో ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ఈ ప్రక్రియపై ఏవేని అనుమానాలు ఉంటే స్థానిక వీఆర్వో నెంబరును తీసుకొని వాట్సాప్ నందు లేదా నేరుగా తనను కానీ వీఆర్వోలను కానీ సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు బండి అమర్‌రెడ్డి, అరగల రమణయ్య పాల్గొన్నారు.



అల్లూరు : గ్రామసభలో తహసీల్దారు లక్ష్మీ నారాయణ, నాయకుడు బండి అమర్ రెడ్డి

● సభలను సద్వినియోగం చేసుకోండి

కొండాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నోషనల్ ఖాతా నెంబర్ల రెగ్యులరైజేషన్‌పై జరుగుతున్న గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం గుడవళ్లూరు, పార్లపల్లిలో గ్రామసభలు నిర్వహించారు. గుడవళ్ళూరులో-3, పార్లపల్లిలో-7 అర్జీలను నోషనల్ ఖాతా నెంబర్లున్న రైతులు అందించినట్లు చెప్పారు. వీటిని పరిశీలించి సరియైన ఖాతా నెంబరు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, గుడవళ్ళూరు సర్పంచు బీ మాచర్ల, వీఆర్వో పోలయ్య పాలినేని రమేష్ పాల్గొన్నారు

రీ సర్వేపై రైతులకు అవగాహన

భూముల రీసర్వే, భూ సమస్యల అంశాలపై తహసీల్దారు కోటేశ్వరరావు గానుగపెంట పంచా యతీ ఆదిమూర్తిపురంలో రైతులకు అవగాహన కల్పించారు. గతంలో జరిగిన రీసర్వేతో ఇబ్బం దులు ఎదుర్కొంటున్న దృష్ట్యా రికార్డుల్లో మా ర్పులు సవరణకు ఈ కార్యక్రమాన్ని వినియో గించుకోవాలని కోరారు. సర్వే పూర్తయిన అనంతరం రైతులకు కొత్త పాసుపుస్తకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సాగునీటి సంఘ అధ్యక్షుడు జాగర్లమూడి శ్రీనివాసరావు, వీఆర్వో మాలకొండయ్య సర్వేయరు మన్మథ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయము బ్రాహ్మణ క్రాక
జలదంకి మండలం, నెల్లూరు జిల్లా

ఆర్.ఓ.సి.నెం.04/2025 | టెండరు ప్రకటన | తేది.04-04-2025

SPSR నెల్లూరు జిల్లా జలదంకి మండలము, బ్రాహ్మణక్రాక గ్రామ పంచాయితీ నందు తేది.01.04.2025 నుండి 31.03.2026 వరకు అనగా ఒక్క సంవత్సర కాలమునకు ఈ దిగువ తెలిపిన పనులకు సిబ్బందిని సరఫరా చేయుటకు తేది.16.04.2025 వరకు ఉదయం 10.30 గం.ల నుండి మధ్యాహ్నం 1.00 గం.వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం 2.00 గం.లకు హాజరు అయిన టెండర్దదారుల సమక్షంలో తెరువబడును. టెండరు దాఖలు చేయు వారు దిగువ తెలిపిన మొత్తంను టెండరు ధరావత్తుగా చెల్లించి రశీదును టెండరు దరఖాస్తుకు జతపరచి దాఖలు చేయవలెను. ఇతర పూర్తి వివరములకు గ్రామ పంచాయితీ కార్యాలయము పనిచేయు వేళల యందు తెలుసుకొనవచ్చును.

వరుస సంఖ్య	వివరములు	సంఖ్య	కాలపరిమితి	ధరావత్తు మొత్తము
1.	PWS స్కీములకు ఆపరేటర్‌గా చేయుటకు	3 ముగ్గురు	తేది 01.04.2025 నుండి తేది 31.03.2026 వరకు	రూ. 5000.00 అయిదు వేలు రూపాయలు
2.	వీధి విద్యుత్ దీపములు మరమ్మత్తులు చేయుటకు	2 ఇద్దరు	తేది 01.04.2025 నుండి తేది 31.03.2026 వరకు	
3.	వీధి దీపములు నిర్వహణకు హెల్పర్ (నిచ్చేన వేయుట మొదలగు) పని చేయుట పోస్టు 1కి నెలకు రేటు విడివిడిగా చూపబడును.	1 ఒక్కరు	తేది 01.04.2025 నుండి తేది 31.03.2026 వరకు	

నిబంధనలు: 1) పంచాయితీ కార్యదర్శి టెండరు రద్దు చేయుటకు ఆమలు పరుచుటకు పూర్తి అధికారము కలదు. 2) పంచాయితీ నిధుల సౌలభ్యమును బట్టి జిల్లా పంచాయితి అధికారి అనుమతి పొందిన తదుపరి మాత్రమే బిల్లులను చెల్లించబడును. బిల్లుల జాప్యమునకు ఎటువంటి వడ్డీ చెల్లించబడదు. 3) కాంట్రాక్టు సిబ్బంది గ్రామ పంచాయతీ సిబ్బందిగా పరిగణించను. 4. టెండరు దాఖలు చేయువారు, వారు సూచించిన రేట్ల ప్రకారం కాలపరిమితి వరకు సరఫరా చేయు గలవారము అని 100 స్టాంపు పేపరు పైన అగ్రిమెంటు దాఖలు చేయవలెను. అగ్రిమెంటు లేనియెడల టెండరు అంగీకరించబడదు. 5. టెండరు అంగీకరించిన వారి టెండరు ధరావత్తును కలెక్టర్ గారి ఉత్తరాలు వచ్చిన పిదప చెల్లించబడును.

పంచాయితీ కార్యదర్శి,
సం/- బ్రాహ్మణక్రాక గ్రామ పంచాయితీ, జలదంకి మండలం, నెల్లూరు జిల్లా



అటవీ విధులకు ఆధునిక వాహనాలు

రేంజర్లకు కొత్త బొలెరో బండ్లు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : అటవీ సంరక్షణకు నిరంతరం విధులు నిర్వహిస్తున్న రేంజర్లకు నూతన బొలెరో వాహనాలను జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్‌బాషా అందజేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి జిల్లాకు వచ్చిన కాంపా నిధుల్లోంచి ఒక్కొక్కటి రూ.10 లక్షల చొప్పున రూ.కోటి వెచ్చించి 10 వాహనాలను కొనుగోలు చేశారు. నెల్లూరు, రాపూరు, కావలి, ఉదయగిరి, ఆత్మకూరు రేంజ్‌ల పరిధిలోని అధికారులకు 5 వాహనాలు, కావలి సబ్ డీఎఫ్‌వోకు ఒక వాహనం అందించారు. మిగిలిన నాలుగు వాహనాలు ఇతర జిల్లాల అటవీశాఖ అధికారులకు అందజేశారు. అనేక సంవత్సరాలుగా పాత వాహనాలతో ఇబ్బందులు పడుతున్న రేంజర్లు నూతన వాహనాలు అందడంతో ఆనందం వ్యక్తం చేశారు.

ఇంటర్ మూల్యాంకనం పూర్తి

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం శుక్రవారంతో పూర్తయింది. ఈ కార్యక్రమం నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మార్చి 7వ తేదీన ప్రారంభమైంది. వివిధ జిల్లాలకు చెందిన 3.54లక్షలకు పైగా జవాబు పత్రాలు జిల్లా స్పాట్ కేంద్రానికి చేరుకున్నాయి. ఇంటర్‌బోర్డు అధికారులు కట్టుదిట్టమైన భద్రత నడుమ జవాబు పత్రాల మూల్యాంకనాన్ని చేపట్టారు. ఈ విధులకు 1200 మంది అధ్యాపకులు, 150 మందికి పైగా ఇతర సిబ్బంది హాజరైనట్లు ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు తెలిపారు. పూర్తయిన జవాబు పత్రాల సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా ఇంటర్‌బోర్డుకు పంపించామని, త్వరలోనే అన్ని ప్రక్రియలు పూర్తి చేసుకుని ఫలితాలు విడుదల చేస్తారన్నారు. నిర్ణీత సమయానికి మూల్యాంకనాన్ని పూర్తి చేసేందుకు సహకరించిన ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్ర టెన్నిస్‌బాల్ క్రికెట్‌కు జిల్లా జట్ల ఎంపిక



నెల్లూరు(విద్య), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో ఈనెల 5, 6వ తేదీల్లో జరిగే 12వ రాష్ట్ర స్థాయి అండర్-19 టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో పాల్గొనే బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ నిర్వాహక కార్యదర్శి పీ అజయ్‌కుమార్ తెలిపారు. ఎంపికైన క్రీడా జట్లకు శుక్రవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జట్లకు ఇటీవల ఎంపికలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశామన్నారు. బాలుర విభాగంలో జగన్, తేజ, మిత్ర, ఇర్ఫాన్, మోక్షిత్, అభిలాష్, వంశీ, ధీరజ్, హరిచరణ్, తులసీరామ్, గురుచరణ్, అనిల్, బాలికల విభాగంలో హారిణి, ధనలక్ష్మి, సోని, గిరీషా, హేమ, పురంధరేశ్వరి, ఏంజల్, కమలి, తులసి, శ్రావణి, రిషిత, పవిత్ర, పద్మ, వైష్ణవి ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో అక్షర విద్యాలయం డైరెక్టర్ ఎంవీ.కుముద, ప్రిన్సిపాల్ ప్రియాజాకబ్, బాలికల టీమ్ మేనేజర్ మమత, లీలాధరరెడ్డి, గౌతమ్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

యథేచ్ఛగా బియ్యం అక్రమాలు

చౌక బియ్యమే... సన్న బియ్యంగా..!!

"జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అధికారుల ఉదాసీనతతో అక్రమార్కులు రెచ్చిపోతున్నా రు. చివరికి కార్డుదారులకు బియ్యం పంపిణీ జరగక ముందే బియ్యాన్ని నల్లబజారుకు తరలించేస్తున్నారు. ఇక, ఎండీయూ వాహనాల వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. లబ్ధిదారుల నుంచి కిలో రూ.12 నుంచి రూ.14 వంతున రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నారు. వాటిని మిల్లర్లకు కిలో రూ.25కు విక్రయిస్తున్నారు. కొందరు మిల్లర్లు ఆ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి మేలైన బియ్యం పేరుతో కిలో రూ.50కి పైబడి ధరకు అమ్మి జేబులు నింపుకుంటున్నారు. ఇంతలా బరితెగిస్తున్న అక్రమార్కులను ప్రజలే పట్టిస్తున్నా, కొందరు అధికారులు కేసులు నమోదు చేయటంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు."

- కిలో రూ.12కు కొనుగోలు
- పాలిష్ పట్టి సన్నబియ్యంగా మార్పు
- ఆపై కిలో రూ.50 - 55కు విక్రయం
- ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి
- అరకొర దాడులు
- అయినా 3 నెలల్లో రూ.25లక్షల బియ్యం సీజ్



నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలో 7.38 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వాటికి 1513 రేషన్ షాపుల నుంచి 438 ఎండీయూ వాహనాల ద్వారా ప్రతినెలా 13వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. కార్డుదారులకు ఉచితంగా ఇచ్చే ఈ రేషన్ బియ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కిలోకు రూ.43 వంతున ఖర్చు చేస్తున్నాయి. అయితే ఈ బియ్యం 50 శాతం కూడా సద్వినియోగం కావడం లేదన్నది బహిరంగ రహస్యం. రూ.కోట్ల విలువైన బియ్యం ప్రతీనెలా పక్కదారి పడుతోంది. చౌక బియ్యం వల్ల నిరుపేదలకు కలిగే లబ్ధికంటే వ్యాపారుల జేబుల్లోకి చేరేదే అధికంగా ఉంటోంది.

● పథకాల కోసమే కార్డులు


జిల్లాలో అధిక శాతం కుటుంబాల వారు సన్నబియ్యం వినియోగిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసమే 60శాతంపైగా కుటుంబాలు రేషన్ కార్డులు కలిగి, బియ్యాన్ని తీసుకుంటున్నట్లు సమాచారం. నెలనెలా బియ్యం తీసుకోకుంటే కార్డు రద్దు అవుతుందనే భయంతో వేలిముద్ర వేసి బియ్యం ఇచ్చే వాహనం వాళ్లకే అమ్మేస్తున్నారు. అంటే కార్డుదారులు కిలో రూ.12 చొప్పున అమ్ముతున్న బియ్యాన్ని తిరిగి వారే రూ.50కుపైగా ధర పెట్టి కొంటున్నారన్నమాట.

కఠిన చర్యలు తీసుకుంటాం



రేషన్ బియ్యం తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. రేషన్ బియ్యం అక్రమాలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో, దీనికి అడ్డుకట్ట వేయడానికి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తాం. ఎండీయూ వాహనాల వారు కార్డుదారులకు బియ్యం ఇవ్వకుంటే చర్యలు తప్పవు.

\- ఎన్ విజయకుమార్, డీఎస్వో



మూడు దశల్లో రేషన్ బియ్యం పాలిష్

జిల్లాలోని నెల్లూరు రూరల్, కావలి పరిధిలో సుమారు 36 రైసు మిల్లులున్నాయి. హైవేకి సమీపంలో ఈ మిల్లులు ఉండటంతో కొన్ని మిల్లుల యజమానులు రేషన్ బియ్యం సేకరించి రహస్యంగా మిల్లుల్లో నిల్వ చేసి రీసైక్లింగ్ చేస్తున్నారు. రాజకీయ నాయకులను ప్రసన్నం చేసుకొని, అధికారులతో లాలూచీ పడుతూ పేదల బియ్యానికి పాలిష్ పెడుతున్నారు. చౌక బియ్యానికి మూడు దశల్లో పాలిష్ పట్టి సన్న బియ్యంగా మారుస్తున్నారు. ఆ తర్వాత పలు రకాల బ్రాండ్ల పేరుతో బ్యాగుల్లో నింపి బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.50, అంతకన్నా ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. కొందరు మిల్లర్లు అయితే బ్రాండ్ల పేరుతో బ్యాగుల్లో నింపిన రేషన్ బియ్యాన్ని రాత్రిపూట జాక్‌పాట్ లారీల్లో బెంగళూరు, చెన్నైకు తరలిస్తున్నట్లు సమాచారం. అంతేకాదు ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తరచూ దాడుల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణా వెలుగు చూస్తున్నా ప్రభుత్వం పూర్తిస్థాయిలో అరికట్టలేకపోతోంది. దీని వెనుక నెలవారీ మామూళ్ల మోజులో పోలీసు, రెవెన్యూ యంత్రాంగంసహా ప్రజా ప్రతినిధులు కూడా అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

మూడు నెలల్లో పట్టుకున్నదిలా..

- 2024 డిసెంబరులో కావలిలో 3.09 లక్షల విలువైన రేషన్ బియ్యాన్ని వాహనంలో తరలిస్తుండగా అధికారులు సీజ్ చేశారు.
- ఈ ఏడాది జనవరి 6న రూ.45,500 విలువైన 10 క్వింటాళ్ల బియ్యాన్ని నెల్లూరు రూరల్‌లోని ముత్తుకూరు రోడ్డు ప్రాంతంలో ఆటోలో తరలిస్తుండగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పట్టుకుని వాహనంతో సహా సీజ్ చేశారు.
- జనవరి 15న రూ.27,300 విలువైన రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా నెల్లూరు రూరల్ ప్రాంతంలో సీజ్ చేశారు.
- జనవరి 21న కందుకూరులో రూ.12.28 లక్షల విలువైన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు.
- ఫిబ్రవరి 8న కావలిలోని ఒక రేషన్ షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 4.33 లక్షల విలువైన రేషన్ బియ్యాన్ని అధికారులు గుర్తించి సీజ్ చేశారు.
- ఫిబ్రవరి 10న బుచ్చిలో అక్రమంగా తరలిస్తున్న రూ.79వేల విలువైన 1750 కేజీల బియ్యాన్ని గుర్తించారు.
- ఫిబ్రవరి 28న కందుకూరులో అక్రమంగా తరలిస్తున్న రూ.21 వేల విలువైన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు.
- మార్చి 10న సంగంలోని ఒక రేషన్ షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 1.88 లక్షల విలువైన బియ్యాన్ని, 14వేల విలువైన కందిపప్పును, రూ.7499 విలువైన చక్కెర ప్యాకెట్లను సంగం ఆర్ఐ సీజ్ చేశారు.
- మార్చి 19న సైదాపురంలోని రేషన్ షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 1.20 లక్షల విలువైన బియ్యాన్ని సీజ్ చేశారు.
- మార్చి 19న కలువాయిలో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రూ.22వేల విలువైన రేషన్ బియ్యాన్ని కలువాయి డీటీ పట్టుకున్నారు. అధికారులు అరకొర దాడులు చేస్తుంటేనే సుమారు మూడు నెలల్లో రమారమి రూ.25 లక్షల విలువైన బియ్యం పట్టుబడితే ఇక పూర్తి స్థాయిలో దృష్టిసారిస్తే ఇంకెంతగా రేషన్ బియ్యం అక్రమాలు బయటపడతాయో ఆలోచించాలి. పైగా అక్రమాలపై 6ఏ కేసులను మాత్రమే నమోదు చేస్తుండటంతో మాఫియాకు భయం లేకుండా పోతోంది.

ఆమంచర్ల అటవీ భూముల్లో

ఉమ్మడి సర్వే



అటవీ అధికారులతో మాట్లాడుతున్న నెల్లూరు ఆర్డీవో అనూష

నెల్లూరు(వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్లోని ఆమంచర్ల అటవీ భూముల్లో నెల్లూరు అటవీ రేంజర్ మాల్యాద్రి, నెల్లూరు ఆర్డీవో అనూష ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి సర్వే చేపట్టారు. 2016లో రిజర్వు ఫారెస్టుకు చెందిన 480 ఎకరాలు, పక్కనే ఉన్న 82 ఎకరాలు కలపి 562 ఎకరాల భూమిని అప్పటి రెవెన్యూ అధికారులు రూ.49.40 కోట్లకు ఏపీఐఐసీకి విక్రయించారు. అందులో ఏపీఐఐసీ వారు 2019లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుండగా అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. ఈ భూమి రిజర్వు ఫారెస్ట్ అని, ఇందులో ఎలాంటి కట్టడాలు చేపట్టకూడదని చెప్పడంతో వివాదం ఏర్పడింది. అప్పటి నుంచి వందలసార్లు సర్వేలు జరిగాయి. కానీ సమస్య కొలిక్కిరాలేదు. తాజాగా అటవీ, రెవెన్యూ అధికారులు ఉమ్మడి సర్వే చేపట్టారు. అటవీ భూమిని ఏపీఐఐసీకి అప్పగిస్తే ఇందుకు బదులుగా అదే విస్తీర్ణం రెవెన్యూ భూమి అటవీశాఖకు అప్పగించాల్సి ఉంటుంది. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. త్వరలోనే ఈ వివాదానికి ముగింపు పలుకనున్నట్లు తెలుస్తోంది.

క్రీడల్లో సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ఆరు వారాలు సర్టిఫికెట్ కోర్సుల్లో చేరి శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో ఆర్‌కే.యతిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పాటియాలాలోని నేతాజీ సుభాష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్(ఎన్ఎస్ఎన్ఐఎస్)లో 2025 విద్యా సంవత్సరానికి మే 6 నుంచి జూలై 2వ తేదీ వరకు నిర్వహించే ఆరువారాల సర్టిఫికెట్ కోర్సుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించి క్రీడల్లో ప్రావీణ్యం కలిగి 2025 ఏప్రిల్ 14 నాటికి 20 నుంచి 40 ఏళ్ల లోపు వయసు కలిగి వారు దరఖాస్తుకు అర్హులని తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, సైక్లింగ్, క్రికెట్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, జూడో, కబడ్డీ, ఖోఖో, రోల్‌బాల్, రోయింగ్, షూటింగ్, స్విమ్మింగ్, తైక్వాండో, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, ఉషు, యోగా క్రీడాంశాల్లో ప్రతిభ కలిగిన వారికి ఆయా అంశాల్లో శిక్షణ అందిస్తారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు www.6wcc.nsni.in పోర్టల్ ద్వారా ఈనెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని డీఎస్ఏ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

హైరిస్క్ గర్భిణులకు

ముందుగా చికిత్స చేయండి

డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత



అధికారులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో సుజాత

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో హైరిస్క్ గర్భిణు లను ముందుగా గుర్తించి వారికి సంపూర్ణంగా వైద్య చికిత్సలు అందేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత ఆదేశించారు. జనవరిలో జరిగిన ఒక తల్లి, ఆరు శిశు మరణాలపై శుక్రవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. గర్భిణులకు అన్నీ రకాల పరీక్షలు తప్పనిసరిగా చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా ఆరోగ్య పర్యవేక్షకులకు పూర్తి బాధ్యత అప్పగించాలని ఆదేశించారు. పుట్టిన బిడ్డలకు తల్లిపాలే పట్టేలా, సకాలంలో రోగనిరోధక టీకాలు వేయించేలా అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యకరమైన ప్రారంభాలు - ఆశాజనకమైన భవిష్యత్తు అన్న నినాదంతో పనిచేయాలని సూచించారు. ఈ సమీక్షలో ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ డాక్టర్ శేషారత్నం, జీజీహెచ్ గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ గీతాలక్ష్మి, జనరల్ మెడికల్ ప్రొఫెసర్ డాక్టర్ బెన్‌హార్, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, డీఐవో డాక్టర్ ఉమా మహేశ్వరి, డాక్టర్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికి పంచ ప్రాధాన్యాలు!

- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ
- వేసవిలో ఉపయోగకరమైన పనులకు శ్రీకారం
- పశువుల దాహం తీర్చే నీటి తొట్టెలపై ప్రత్యేక శ్రద్ధ

ఉదయగిరి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వేసవిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఐదు ప్రాధాన్యాలతో పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులకు సూచనలు చేసింది. అందులో ప్రధానంగా పశువుల నీటి తొట్టెలు, చెరువుల పునరుద్ధరణ, పంట కుంటలు, సగటు వేతనం, పంట కాలువల పునరుద్ధరణ నిర్మాణం చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది.

● పశువుల నీటి తొట్టెలు

వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని పశువుల తాగునీటికి ఇబ్బంది లేకుండా నీటితొట్ల నిర్మాణం చేపట్టనున్నారు. జిల్లాలో 963 నీటి తొట్టెల నిర్మాణం లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటివరకు 693 తొట్ల పనులకు రూ.2.22 కోట్ల రూపాయలతో పరి పాలన ఆమోదం లభించింది.

● చెరువుల పునరుద్ధరణ

గ్రామానికి, రోడ్లకు సమీపంలో ఉన్న చెరువులను గుర్తించి వాటిని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి మండలంలో ఐదు ఎకరాల్లోపు ఉండే రెండు చెరువులను గుర్తించి అందంగా తయారు చేయనున్నారు. జిల్లాలో 272 చెరువుల్లో రూ.23.90 కోట్లతో పూడిక తీసి నీటి నిల్వ సామర్థ్యం పెంచి చెరువుకట్టలను బలోపేతం చేయనున్నారు.

● పంటకుంటల తవ్వకం

ప్రతి రైతు పొలంలో సేద్యపు నీటికుంటలను నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ఈ పంట కుంటలు ఎంతగానో ఉపయోగపడతాయి. పంట కుంటలో నీటిని నిల్వ చేసుకుంటే భూగర్భజలాలు పెరగడంతో పాటు పశువులకు వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. జిల్లాలో రూ.47.25 కోట్లతో 7,500 పంట కుంటలు తవ్వించాలన్నదే లక్ష్యం.

● పంట కాలువల పునరుద్ధరణ



దుత్తలూరు మండలం వెంకటంపేటలో నీటితొట్టి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కలెక్టర్(ఫైల్)

సాగునీటి కాలువల్లో పూడికతీత చేపట్టి రాబోయే పంట సమయానికి ఆయకట్టు చివరి పొలం వరకు సాగునీరు అందేలా ప్రతి కాలువను పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 8,737 కిలోమీటర్ల పొడవున కాలువల్లో రూ.81.25 కోట్ల నిధులతో పూడిక తీసి పునరుద్ధరించనున్నారు.

● సగటు వేతనం

ఉపాధి హామీ కూలీలకు 60 లక్షల పనిదినాలు లక్ష్యంగా సగటు దినసరి వేతనం రూ.307 పొందేలా పనులు చూపనున్నారు. కనీసం నాలుగు గంటలు పని ప్రదేశంలో ఉండాలని నిర్దే శించారు. ఇందుకు కూలీలకు, మేట్లకు కనీస అవగాహన కల్పిం చాల్సిన బాధ్యత ఉపాధి హామీ అధికారులపై ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ ఆనంద్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ గంగాభవానీ ఇప్పటికే ఆయా పనులకు సంబంధించి గ్రామాల్లో భూమి పూజ చేశారు. ఉపాధి పథకం కింద గ్రామాల్లో అందరికీ ఉపయోగకరమైన పనులు చేపట్టడంపై పల్లె ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జీవాల దాహార్తి తీర్చే తొట్టెలు

● ఆత్మకూరుకు 161 మంజూరు

ఆత్మకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం నీటి తొట్టెల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని 136 పంచాయతీల్లో 161 నీటి తొట్టెలు నిర్మించనున్నారు. పశువులు గుంపులుగా రాకపోకలు సాగించే మార్గాల్లో వీటిని నిర్మించాలని ప్రభుత్వం సూచించింది. ఉపాధి హామీ పథకం కింద 2 మీటర్లు వెడల్పు, 5 మీటర్లు పొడవు, 60 సెంటీమీటర్లు ఎత్తున ఒక్కో తొట్టి నిర్మించేందుకు రూ. 33,220 వెచ్చించనున్నారు. ఏప్రిల్ 15లోగా వీటిని అందుబాటులోకి తెచ్చేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గతంలో నిర్మించిన వాటిలో శిథిలస్థితికి చేరిన నీటితొట్టెలకు మరమ్మతులు కూడా చేయించనున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● పంచాయతీకి ఒకటి...

పశువుల నీటి తొట్టెలను సగటున పంచాయతీకి ఒకటి చొప్పున మంజూరు చేశారు. కొన్ని పంచాయతీల్లో పశువుల సంఖ్యను బట్టి మరొకటి అదనంగా మంజూరు చేశారు. ఈ క్రమంలో ఆత్మకూరు మండలానికి 24, మర్రిపాడుకు 40, ఏఎస్‌పేటకు 22, చేజర్లకు 30, సంగంకు 20, అనంతసాగరానికి 25 నీటితొట్టెలు మంజూరయ్యాయి. నీటి వసతి ఉన్న చోట వీటిని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టరు మర్రిపాడు మండలంలోని డీసీపల్లిలో నీటితొట్టి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయం విదితమే. ఒక్కో నీటితొట్టెను 5200 లీటర్ల నీటితో నింపుతారు. గేదెలకు రోజుకు 40 లీటర్లు, ఆవులకు 30 లీటర్లు, మేకలు, గొర్రెలకు రోజుకు 5 లీటర్లు చొప్పున నీరందేలా నిర్మాణాలు చేపట్టనున్నారు.

త్వరితగతిన పూర్తి చేస్తాం

వేసవిలో పశువులకు నీటి సమస్య లేకుండా త్వరలో తొట్టెలను అందుబాటులోకి తీసుకొస్తాం. ఒకేసారి ఎక్కువ పశువులు వినియోగించే విధంగా వీటిని నిర్మిస్తున్నాం. ముఖ్యంగా పశువులకు, గొర్రెలు, మేకలకు అనుకూలంగా వేరువేరుగా నీటి తొట్టెల నిర్మాణం చేపడతాం. వీటి నిర్వహణ బాధ్యతను ఆయా గ్రామ పంచాయతీలు చేపడతాయి.

\- శంకరనారాయణ, ఏపీడీ, ఆత్మకూరు

కసుమూరులో భక్తుల సందడి

వెంకటాచలం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు మస్తాన్‌వలి దర్గాలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతో పాటు రాష్ట్ర నలమూల నుంచి అ ధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించగా మరికొందరు అన్నదానం చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి దర్గాకు పూలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8652
వెండి కిలో ధర	రూ. 95,500
వెండి ఒక గ్రాము	రూ.98.50

వసతుల లేమి!



నిరుపయోగంగా ఉన్న ముత్తుకూరు మార్కెట్

● రూ.50లక్షలతో మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం ● ప్రణాళికతో చేపట్టని నిర్మాణం
● వ్యాపారులకు కొరవడిన వసతులు ● చేరేందుకు ఆసక్తి చూపని వైనం

ముత్తుకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని ప్రధానకూడలిలోని పంచాయతీ స్థలంలో నిర్మించిన మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం నిరుపయోగంగా మారింది. గతంలో చికెన్, చేపల వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారం కొనసాగించేవారు. అయితే ఈ స్థలంలో మార్కెట్ కాంప్లెక్స్ నిర్మించాలని నిర్ణయించంతో దుకాణాల ఆక్రమణలు తొలగించారు. చేపలు, చికెన్ వ్యాపా రులు ఆందోళన వ్యక్తం చేయడంతో వారి కోసం ప్రత్యేకంగా అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మార్కెట్ నిర్మాణంపై హామీ ఇచ్చారు. అందుకోసం మార్కెట్ స్థలాన్ని గుర్తించడంతో పాటు నిధులు మంజూరు చేయించారు. అయితే ప్రతిపక్ష నాయకులు కొందరు కోర్టుకు వెళ్లడంతో మార్కెట్ నిర్మాణం ముందుకు సాగలేదు. అనంతరం అప్పటి మంత్రి సోమిరెడ్డి చొరవతో నిధులు మంజూరు చేయించి మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మార్కెట్ నిర్మాణానికి చాలారోజులు మోక్షం కలు గలేదు. ప్రధానంగా చికెన్ వ్యాపారులు రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారం కొనసాగించారు. మార్కెట్ నిర్మాణం కోసం డిమాండ్ పెరగడంతో వైసీపీ హయాంలో మంత్రిగా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీతో మాట్లాడి నిర్మాణ వ్యయాన్ని రూ.50లక్షలకు పెంచి నిధులు మంజూరు చేయించారు. మార్కెట్ నిర్మాణం పూర్తయితే తమ బాధలు తీరుతాయని చేపలు, చికెన్ వ్యాపారులు భావించారు. ఎలాంటి ప్రణాళిక లేకుండా మార్కెట్ సముదాయం నిర్మించడంతో అక్కడికి మారేందుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. కాంట్రాక్టు తీసుకున్న వైసీపీ నాయకులు నిధులు విషయంలో చూపిన ఆసక్తి నిర్మాణంలో చూపలేదన్న విమర్శలున్నాయి. తూతూ మంత్రంగా నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేశారు. చేపల వ్యాపారానికి అంతంతమాత్రంగా ఉన్నా చికెన్ అంగళ్లు నడుపుకునేందుకు మార్కెట్ సముదాయంలో ఏర్పాటు చేసిన దుకాణాలు ఎందుకు పనికిరావన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం సెంటర్‌లో అంగళ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారం సాగిస్తున్నామని, కొత్తగా నిర్మించిన మార్కెట్ లోపలికి ఉన్నందున కొనుగోలుదారులు అక్కడికి వచ్చే అవకాశం లేదని వ్యాపారులు వాపోతున్నారు. రోజువారి చేపలు, చికెన్ అమ్ముకుని జీవనం సాగించాలని, వ్యాపారం లేకపోతే మా పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.50లక్షలతో నిర్మించామని చెబుతున్నా మార్కెట్ నిర్మాణం నాసిరకంగా ఉందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మత్స్యకారులు కోసమే మార్కెట్ నిర్మాణం చేశామని చెబుతున్నా మత్స్యకార మహిళలు ఎవరూ వ్యాపారం చేసేందుకు నూతన మార్కెట్‌కు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు.

గృహ నిర్మాణ అవినీతిదారులపై రెవెన్యూ రికవరీ యాక్టు

● గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారథి
● పొదలకూరు, తోటపల్లి గూడూరు మండలాల్లోని ఇళ్ల నిర్మాణాల పరిశీలన

పొదలకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జగనన్న లే అవుట్ల పేరుతో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు రెవెన్యూ రికవరీ యాక్టు అమలు చేస్తామని గృహ నిర్మాణ, పౌరసంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలిసి పొదలకూరు పంచాయతీ పరిధిలోని చిట్టేపల్లి తిప్ప వద్ద నిర్మించిన జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హడావిడిగా వైసీపీ నాయకులు పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని, అందులో చాలామందికి ఇళ్ల స్థలాలు చూపలేదన్నారు. పేదల ఇళ్లపై పర్యవేక్షణ లేకుండా ఎంత నిర్లక్ష్యం కట్టారో వీటిని చూస్తే అర్థం అవుతుందన్నారు. అధికారులు కూడా అవినీతికి పూర్తిగా సహకరించారని తెలుస్తుందన్నారు. ఒకరి ఇంటి బిల్లులను మరొకరి అకౌంట్‌లోకి వేసి కొందరు అధికారులు నీచంగా ప్రవర్తించారన్నారు. అనంతరం గృహ నిర్మాణశాఖ అధికారులను, ఇళ్ల లబ్ధిదారులను ఇంటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, బిల్లులు, నాణ్యత ప్రమాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఎండీ రాజబాబు, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులు, టీడీపీ మండలాధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణాధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జుననాయుడు, మహిళ అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ, నాయకులు కోవూరు బక్కయ్యనాయుడు, కర్రియావుల శ్రీనివాస్, కోడూరు భాస్కర్‌రెడ్డి, నారాయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



గిరిజన గృహాలను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే సోమిరెడ్డి

● ఏ ఒక్కరిని వదిలిపెట్టం

తోటపల్లిగూడూరు, (ఆంధ్రజ్యోతి): వరిగొండ గిరిజన గృహాలను మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే సోమిరెడితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత లబ్ధిదారులు మంత్రితో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాల బిల్లులు తమ అకౌంట్లలో పడ్డాయని, మాతో సంతకాలు పెట్టించుకుని ఆ నగదును వైసీపీ నాయకులు, కాంట్రాక్టర్లు తీసుకున్నారని మంత్రి ఎదుట వాపోయారు. పేదల ఇళ్ల నిర్మాణాల్లో రూ.కోట్లలో దోచుకున్న ఏ ఒక్కరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. ఈ ఐదేళ్లకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 10లక్షల ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నదే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎండీ రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, కోడూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.


తీరప్రాంత రక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న మెరైన్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి

ముత్తుకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీరప్రాంత రక్షణ అందరి బాధ్యతగా భావించాలని మెరైన్ సీఐ వేణు గోపాల్‌రెడ్డి తెలిపారు. కృష్ణపట్నం ఆర్కాట్‌పాలెంలో శుక్రవారం ఇండియన్ కోస్ట్ గార్డ్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ ఇంటరాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ పాల్గొని మాట్లాడారు. తీరప్రాంత భద్రతకు మత్స్యకారులు సహకరించాలని కోరారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లినపుడు కొత్త బోట్లు చూసినా, ఎవరైనా అనుమానితుల సంచారం, తెలియని వ్యక్తులు తిరుగుతున్నా తమకు సమాచారం అందజేయాలన్నారు. సముద్రం ద్వారా తీరంలోకి వచ్చే అవకాశం, అలాగే స్మగ్లింగ్ కార్యక్రమాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. ఏ సమాచారం తెలిసినా 1554 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాని సూచించారు. బోట్లు బాగుంటేనే సముద్రంలోకి వెళ్లాలని, లైఫ్ జాకెట్లు తప్పనిసరిగా ధరించాలని, వంటకు ఎల్‌పీజీ సిలిండర్లు ఉపయోగించాలని సూచించారు. వేటకు వెళ్లేవారు తప్పనిసరిగా బయోమెట్రిక్ కార్డులను వెంట ఉంచుకోవాలన్నారు. బోట్లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలన్నారు. తీరంలో కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణకు తాబేళ్ల పెంపకం చేపడుతున్నట్లు తెలిపారు. మత్స్యకార యువకులు చదువుకొని ఎంసీసీలో ఉంటే నేవీ మరియు మెరైన్‌లో ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోస్ట్ గార్డ్ డిప్యూటీ కమాండెంట్ లోకేష్, సత్యనారాయణ, ఫిషరీ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, సాగర మిత్ర చరిత, మత్స్యకార కాపులు, తదితరులు పాల్గొన్నారు.

రుక్మిణీ కల్యాణ పారాయణంతో శుభాలు



ప్రవచనం చేస్తున్న అవధాని రాజశేఖర్

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వివాహం ఆలస్యమైన వారు, వివాహమై దాంపత్యం అన్యోన్యంగా లేనివారు 40 రోజులు రుక్మిణీ కల్యాణ పారాయణం చేస్తే శుభం కలుగుతుందని అవధాని రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన నవాబుపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా రుక్మిణీ కల్యాణం ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ఉదయం మూలవర్లుకు పుష్పార్చన, నవగ్రహ హోమం, శుక్ర గ్రహానికి విశేష హోమాలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ముల్లవరపు లక్ష్మీనరసింహారావు, దేవస్థానం మాజీ చైర్మన్ సాదా నాగేంద్రకుమార్, కంచి జ్ఞానేంద్ర, అన్నవరం సత్యనారాయణ, టి.లక్ష్మీనారాయణ, వాసవీ కన్యకాపరమేశ్వరి పీఠం మహిళా భక్తులు పాల్గొన్నారు.

జనన ధ్రువీకరణ పత్రాల్లేక అందని ఆధార్



గాంధీ కాలనీలో ఆధార్‌కార్డులు లేని గిరిజన బాలలు

కోవూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు అందాలంటే ఆధార్ కార్డు అవసరం. అన్నింటికీ ఆధార్ కార్డులు లేక నియోజకవర్గ పరిధిలోని గిరిజనులు ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. పేదరికం, నిరక్షరాస్యతతో గిరిజనులు ఓ వైపు అల్లాడుతుండ గా ఆధార్‌కార్డులు లేకపోవడం వారి పరిస్థితి మరింత దిగజారుతోంది.

● ఆధార్‌కార్డు పొందాలంటే..

వీరికి జనన ధృవీకరణ పత్రాలు లేకపోవడం..గిరిజన బాలలకు ఆధార్ కార్డుల్ని ప్రభుత్వం కేటాయించలేక పోయింది. ఇటీవల కాలంలో గిరిజనులకు ఆధార్‌కార్డుల మంజూరు చేసేందుకు ప్రత్యేకంగా ఆధార్ నమోదు కేంద్రాల్ని కోవూరు, కొడవలూరు, విడవలూరు, ఇందుకూరుపేట, బుచ్చిరెడ్డిపాళెం మండల పరిధిలోని గ్రామాల్లో పలు చోట్ల ఏర్పాటు చేశారు. గిరిజన బాలలకు జనన ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో వారికి ఆధార్‌కార్డులకు అప్లై చేసేందుకు వీలుకాలేదు.

● జనన ధృవీకరణ పత్రాలు కావాలంటే..

ఆయా గ్రామ పంచాయతీల్లో పొందాలి. తమ పిల్లల వివరాల్ని జన్మించిన సమయంలోనే పంచాయతీ రికార్డుల్లో నమోదు చేసి ఉంటే డేట్‌ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ తీసుకునే వీలుండేది. పెద్దసంఖ్యలో నిరక్షరాస్యులైన గిరిజనులు పంచాయతీ కార్యాలయాల్లో తమ పిల్లల పేర్లను జనన, మరణ రిజిష్టర్లల్లో నమోదు చేయలేదు. ఆధార్ నమోదు కోసం పంచాయతీ కార్యాలయానికి డేట్‌ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ కోసం వెళ్తే పంచాయతీ అధికారులు ఆలస్యంగా నమోదు చేసుకునే ప్రక్రియను వివరిస్తున్నారు.

● ఆర్డీఓ అనుమతి తీసుకుంటేనే..

ఆర్డీవో అనుమతి ఉంటేనే డేట్‌ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ పొందే వీ లుంటుంది. నిరక్షరాస్య గిరిజనులకు ఆ ప్రక్రియను అనుసరించి సర్టిఫికెట్ చాలా కష్టంగా తయారైంది. ఎల్లాయపాళెం, కొడవ లూరు పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ఇద్దరు తమ ప్రాం తంలోని పిల్లలకు డేట్‌ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ల మంజూరు చేసేందుకు స్వచ్ఛందంగా తిరిగారు. సర్టిఫికెట్లు ఇప్పించ గలి గారు. నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాల ఏర్పాటుతో పాటు గిరిజన బాలల భవిష్యత్తు కోసం జనన ధృవీకరణ పత్రాల మంజూరుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

● పౌషకాహారం అందడం లేదు

తన కుమారుడి పేరు శేఖర్. ఆధార్‌కార్డు లేక పోవడంతో అంగన్‌వాడీ కేంద్రానికి రానివ్వడం లేదు. పిల్లలందరికీ పౌషకా హారం అందడం లేదు. ఆధార్‌కార్డు రాకపోవడానికి కారణం బాలుడికి జనన ధృవీకరణ పత్రం లేకపోవడం. ఇదే కాలనీలో 20 ఏళ్లు ఉంటున్నా.

\- పేరు చెంచమ్మ, గాంధీ గిరిజన కాలనీ

● బర్త్ సర్టిఫికెట్ లేదయ్యా

\- నా కుమారుడు శశివర్ధన్‌కు బర్త్ సర్టిఫికెట్ లేదు. రెండేళ్ల నుంచి ప్రయత్నం చేస్తున్నా. కావడం లేదు. బర్త్ సర్టిఫికెట్ లేనందు వల్ల ఆధార్‌కార్డు తీసుకోలేక పోతున్నాం. ఆధార్ చేయించేందుకు చాలా సార్లు తిరిగాం. అధికారులు మామీద దయచూపాలి.

\- పోలమ్మ, మైథిలీ సెంటర్, కోవూరు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కసుమూరు సమీపం లోని కనుపూరు కాలువపై ఉన్న వంతెన వద్ద శుక్రవారం సాయం త్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆత్మకూరు సుబా ని, కరీముల్లాలు గాయపడ్డారు. మోటర్ బైక్‌పై కసుమూరు దర్గాకు దైవ దర్శనం కోసం వచ్చి తిరిగి వెళ్తుండగా టిప్పర్ ఎదురుగా రావడంతో బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. గాయపడిన క్షతగాత్రు లను కసుమూరు ప్రైవేటు క్లినిక్‌కు తరలించి ప్రథమ చికిత్స అం దజేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కామాక్షితాయి సన్నిధిలో ఎస్సీఎస్టీ అట్రాసిటీ కోర్టు జడ్జి

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ ఆలయంలో శుక్రవారం 5వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.సరస్వతి శుక్రవారం మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ పండితులు, అర్చకులు వారిని ఆలయ సాంప్రదాయాలతో స్వాగతించి స్వామి,అమ్మవారి శేషవస్త్ర ములతో సత్కరించి ఆశీర్వదించారు. వారి వెంట టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మురళి, ఎస్ఐ సంతోష్ రెడ్డి సిబ్బంది ఉన్నారు.

వైభవంగా సామూహిక కుంకుమార్చన

ఈ సందర్భంగా కామాక్షితాయికి సామూహిక కుంకుమార్చన చేపట్టారు. అనంతరం అమ్మవారికి పల్లకిసేవ నిర్వహించి ఆలయం చుట్టూ ఊరేగించారు. ఉదయం ఆలయంలో గంగ,కామాక్షితాయి సమేత శ్రీ మల్లికార్జున స్వామివారికి ఆలయ పురోహితులు నిత్య కల్యాణం నిర్వహించారు.

ఘనంగా సరస్వతి పూజ

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సౌత్ ఆములూరు పాఠశాలలో శుక్రవారం సరస్వతి పూజ, పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ చెరుకూరు సరళ పాల్గొన్నారు. కార్య క్రమంలో పంచాయతీ సెక్రెటరీ సీహెచ్ విజయదుర్గ, ఎస్ఎంసీ చైర్మన్ ఆర్.సువార్త, పాఠశాల ఉపాధ్యాయులు కె.వసంతలక్ష్మీ, కే.హెప్సీ విద్యుల్లత, బి.కృష్ణవేణి, సచివాలయ సిబ్బంది సునీజ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

న్యూస్ బాక్స్

నేటినుంచి బ్రహ్మోత్సవాలు



బుచ్చిలో సీతా,లక్ష్మణ సమేత కోదండ రామస్వామి

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 4 (ఆంధ్ర జ్యోతి): పెద్దూరు సీతా, లక్ష్మణ సమేత కోదండ రామస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి అంకురార్పణ కార్యక్రమంతో ప్రారంభం కానున్నట్లు శుక్రవారం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి తెలిపారు. ఆలయంలలో పండితులు, అర్చకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారికి ధ్వజారోహణం, రాత్రి శేషవాహన సేవలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంను ప్రారంభిస్తున్న మండల వ్యవసాయాధికారి జహీర్

మనుబోలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం మండల కేంద్రంలో శుక్రవారం మజ్జిగ చలివేంద్రంను ప్రారంభించారు. రవి ఫర్టిలైజర్స్ అధినేత ధామిశెట్టి వెంకటరంగారావు తొలిరోజు మజ్జిగ పంపిణీ చేయించారు. వేసవి కాలం పూర్తయ్యేవరకు మంచినీటి చలివేంద్రం కొనసాగుతుందని తెలిపారు. చలివేంద్రం ఏర్పాటుపై పలువురు రైతులు, ప్రయాణికులు దాతను అభినందించారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి



మనుబోలులో ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

మనుబోలు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): త్వరలో మనుబోలులో జరగబోయే రీసర్వేకు అందరూ రైతులు సహకరించాలని తహసీల్దార్ సీహెచ్, సుబ్బయ్య కోరారు. శనివారం వీరభద్రస్వామి ఆలయం వద్ద రీ సర్వే గ్రామసభను నిర్వహించారు. ఈ సం దర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతు లు రీసర్వే జరిగే సమయంలో సిబ్బందికి పత్రాలు అందించి, తప్పులు దొర్లకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి రీసర్వేపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ మంజుల, వీఆర్‌వోలు నాగార్జునరెడ్డి, శ్రీనువాసులు పాల్గొన్నారు.

సైడ్ కాలువలు నిర్మించాలంటూ ధర్నా



ఇందుకూరుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మైపాడు బీసీ కాలనీలో సైడ్ కాలువలు నిర్మించకుండా సిమెంటు రోడ్డు వేస్తున్నారని శుక్రవారం మహిళలు ధర్నా నిర్వహించారు. అనంత రం వారు మీడియాతో మాట్లాడారు. రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా కాలువలు మంజూరైనా వాటిని పూర్తి చేయకుండా రోడ్డు వేయడంతో మురుగునీరు పోయే వీలు లేకపోవడంతో కాలనీలో చేరి దుర్గం ధం నెలకొందన్నారు. ఈ సమస్య తో వ్యాధులు ప్రబలుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు

పొదలకూరు, ఏప్రిల్ 4 (ఆం ధ్రజ్యోతి): మండలంలోని వావింటపర్తి గ్రామానికి చెందిన గౌతమ్ అనే విద్యార్థి గురువారం అదృశ్యమయ్యాడు. ఇటీవల ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు రాసి ఇంటికి వచ్చాడు. వ్యవసాయ పనుల్లో తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేవాడు. గురువారం ఉదయం తల్లిదండ్రులతోపాటు నిమ్మతోటలో పనిచేశాడు. తన ఫోన్‌ను నిమ్మ చెట్టు దగ్గరే వదిలేసి వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు కొంతసేపటికి తిరిగి వస్తాడని అనుకుని ఎదురుచూశారు. అతను ఎంతకూ తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పలుచోట్ల ఆరా తీశారు. అయినా ఆచూకీ తెలియకపోవడంతో కండలేరు డ్యాం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

C.R.I.M.E N.E.W.S

తగ్గేదేలా..!

● పేట్రేగుతున్న ఇసుకాసురులు
● మొన్న రాజుపాళెం.. ఇప్పుడు తెలుగురాయపురంలో అక్రమ రీచ్‌లు
● భారీ వాహనాలతో రేయింబవళ్లు ఇసుక తరలింపు
● అన్నీ తెలిసినా కళ్లు మూసుకుంటున్న అధికారులు



తెలుగురాయపురం అక్రమ రీచ్‌లో టిప్పర్లకు ఇసుక లోడ్ చేస్తున్న యంత్రం

కలువాయి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కలువాయి మండలంలో ఇసుకాసురులు తగ్గనంటున్నారు. పెన్నానదిలో ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన అక్రమ రీచ్‌ల నుంచి యంత్రాలతో ఇసుక తవ్వి, భారీ వాహనాలతో తరలిస్తున్నారు. కొంతకాలంగా రాజుపాళెం సమీపంలోని రీచ్ నుంచి ఇసుక తరలిస్తుండగా తాజాగా వారం రోజుల నుంచి తెలుగురాయపుం వద్ద మరో అక్రమ రీచ్ తెరిచారు. ఈ రెండు రీచ్‌ల నుంచి అడ్డూ, ఆపూ లేకుండా రేయింబవళ్లు ఇసుకను తోడేసి సరిహద్దులు దాటించేస్తున్నారు. ఒక్కో లారీ ఇసుక రూ.10-15వేల వరకు అమ్ముకుంటున్న అక్రమార్కులు రూ.లక్షల్లో జేబులు నింపుకుంటున్నారు. తెలుగురాయపురం రీచ్ నుంచి ఇసుక వాహనాలు కలువాయి తహసీల్దారు కార్యాయలయం ముందు నుంచే వెళ్తున్నా అధికారులు మాత్రం కన్నెత్తి చూడటం లేదు.

● 4 రోజుల్లోనే తెరుచుకున్న గేట్లు

రాజుపాళెం రీచ్‌లో అక్రమార్కులు ఏకంగా నదిలోకి సుమారు కిలోమీటరు పొడవున రోడ్డు నిర్మించేశారు. దీనిపై గత నెల 21వతేదీ ఆంధ్రజ్యోతిలో ఓ కథనం కూడా ప్రచురితమైంది. ఆ మరుసటి రోజు తహసీల్దారు శ్యామ్‌సుందర్‌రాజు స్పందించి ఈ అక్రమ రీచ్‌ను మూసి వేసినట్లు ప్రకటించారు. ఈ మేరకు రెవెన్యూ సిబ్బంది రీచ్‌లోనికి వెళ్లే గేటుకు తాళం వేశారు. అయితే, సరిగ్గా నాలుగు రోజులు గడవక ముందే ఏం జరిగిందో ఏమో మళ్లీ రీచ్ గేట్లు తెరుచుకున్నాయి. ఈ వ్యవహారం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

● మైనింగ్ వాళ్లకు చెప్పండి!

తెలుగురాయపురం, రాజుపాళెం వద్ద ఎలాంటి రీచ్‌లకు అనుమతులు లేవు. చర్యలు తీసుకునేందుకు మాకు అధికారం లేదు. కాబట్టి మైనింగ్ వాళ్లకు చెప్పండి. వాళ్లు చర్యలు తీసుకుంటారు.

\- శ్యామ్‌సుందర్‌రాజు, తహసీల్దారు

20 కిలోల గంజాయి స్వాధీనం

● వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద తనిఖీల్లో పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నెల్లూరు(క్రైం),ఏప్రిల్ 4 (ఆంధ్ర జ్యోతి): విశాఖపట్నం నుంచి మదురైకి ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న 20కిలోల200గ్రాముల గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకుని ముగ్గురు నింది తులను అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబం ధించిన వివరాలను జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్ విలేకర్లకు వెల్లడించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పీ.జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం తనిఖీలు చేపట్టారన్నారు. ఆర్టీసీ బస్సులో అనుమానాస్పదంగా ఉన్న సుందర్‌పాండి, నేతాజీ, కుమార్ అనే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి లగేజీ బ్యాగులు తనిఖీ చేశారన్నారు. అందులో మూడు ప్యాకెట్లలో 20కేజీల 200 గ్రాముల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారన్నారు. వారిని విచారించగా దీనిని విశాఖపట్నంలో హనుమాన్ అనే వ్యక్తి నుంచి రూ.90వేలకు కొనుగోలు చేసి మూడు బ్యాగుల్లో మదురైకి తర లిస్తున్నట్లు తెలిపారన్నారు. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకో వడంతో పాటు ముగ్గురు నిందితులను ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు ఎస్‌డీ కాలేషావలి, సీహెచ్ పూ ర్ణకుమార్, సిబ్బంది శ్రీనివాసులు, రమణయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం

బిట్రగుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప జాతీయ రహదారిపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల సమీపంలోని డివైడర్ మధ్య శుక్రవారం గుర్తుతెలియని (30) వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు తిప్ప ఎస్ఐ భోజ్య తెలిపారు. మృతదేహ పరిస్థితిని చూస్తే రోడ్లపై తిరిగే వ్యక్తిలా ఉన్నాడని చెప్పారు. మృతదేహంపై స్వల్ప గా యాలు ఉన్నాయని, గుర్తుతెలియని వాహనం ఢీకొని ఉండొచ్చనే అనుమానం వ్యక్తం చేశారు. వీఆర్వో హరిబాబు ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

నాణ్యమైన పొగాకుకు మద్దతు ధర ఇవ్వాలి

కలిగిరి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన నాణ్యమైన పొగాకుకు మద్దతు ధర అందించాలని పొగాకు రీజనల్ మేనేజర్ ఎం.లక్ష్మణరావు పొగాకు కొనుగోలు కంపెనీ ప్రతినిధులకు సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన రైతులతో పొగాకు ధరల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది వాతవరణ పరిస్థితులు అనుకూలించడంతో నాణ్యమైన పొగాకు దిగుబడి వచ్చిందని, ధరలు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని బోర్డు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్ కుమార్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కిలో పొగాకు రూ.281

స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 430 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో ఏడు కంపెనీ ప్రతినిధులు పాల్గొని 263బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-150, ఆర్ఆర్-2, సీఆర్-10, జంపింగ్‌లాట్స్-5 కారణాలతో 167బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.281, కనిష్ఠ ధర రూ.230, సగటు ధర రూ.265.78గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.



పొగాకు వేలంను పరిశీలిస్తున్న ఆర్ఎం.లక్ష్మణరావు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	113
స్కిన్ చికెన్	202
స్కిన్‌లెస్	226

కోడిగుడ్ల ధర (100): 430



జయభారత్ ఆసుపత్రికి రూ.2 లక్షల విరాళం

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని జయభారత్ ఆసుపత్రిలో ఉచిత కంటి శస్త్రచికిత్స కోసం అమలు చేస్తున్న నేత్ర రక్ష సేవా పథకానికి బెజవాడ రామచంద్రారెడ్డి మనవడు సునీల్ చంద్రారెడ్డి, ఉమ దంపతులు రూ.2లక్షల విరాళం ఇచ్చారు. దీనికి సబంధించిన చెక్కును శుక్రవారం ఆసుపత్రిలో వైద్య సేవాసమితి కోశాధికారి గుర్రం సుధాకర్‌కు అందజేశారు. వైద్య సేవా సమితి చైర్మన్ సీతారామిరెడ్డి మాట్లాడుతూ గతంలో దాత తండ్రి బెజవాడ కృష్ణారెడ్డి కంటి శస్త్ర చికిత్సకు వైద్య పరికరాలు అందజేశారన్నారు. దాతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వేదగిరి బ్రహ్మోత్సవాలకు గుంజ ప్రతిష్ఠ



ఆలయంలో గుంజను ప్రతిష్ఠిస్తున్న అర్చకులు, అధికారులు

నెల్లూరురూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : వేదగిరి క్షేత్రంలో మే 6వ తేదీ నుంచి నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం ఆలయ అర్చకు, అధికారులు గుంజ ప్రతిష్ఠ వేడుక నిర్వహించారు. నెల రోజుల్లో ఉత్సవాలు మొదలుకాబోతున్న నేపథ్యంలో పనులు మొదలుపెట్టేందుకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి సన్నిధి ఎదుట గుంజను ప్రతిష్ఠించారు. మే 6న మొదలయ్యే బ్రహ్మోత్సవాలు 16వ తేదీతో ముగియనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో గోపి, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

ఖాసీంకు ప్రశంసాపత్రం

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : అన్న క్యాంటీన్ నిర్వహణకు గత ఏడాది ఆగస్టు నెల నుంచి ప్రతి నెలా రూ.5వేల విరాళం అందచేస్తున్న నగరానికి చెందిన భారత సేవా ఫౌండేషన్ జిల్లా కార్యదర్శి, విశ్రాంత ఏఎస్‌డబ్ల్యూఓకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు తరఫున అన్న క్యాంటీన్ చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ-కార్యదర్శి ఎం.హరినారాయణన్ ప్రశంసాపత్రం పంపారు. అంతే కాకుండా ముఖ్యమంత్రి విజన్ అయిన స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నారు.

స్వామిదాస్ స్కూలు ఎదుట స్పీడ్ బ్రేకర్లు తొలగించవద్దు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : పిల్లలకు తరచూ ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా స్వామిదాస్ స్కూలు ఎదుట ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగించవద్దని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేషన్ కలసి విన్నవించారు. మినీబైపాస్ నుంచి బాలాజీనగర్ అనుసంధానం చేస్తూ కాలువ కట్టపై 16వ డివిజన్‌లో నిర్మించిన బ్రిడ్జి వలన తరచూ స్వామిదాస్ పాఠశాల విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. దీంతో పాఠశాల యాజమాన్యం రెండు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థుల ప్రాణాలకు సంబంధించిన విషయం కావడంతో మంత్రి నారాయణకు, మున్సిపల్ కమిషనర్‌కు విషయం తెలియజేస్తామని సిబ్బందికి చెప్పి పంపించారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ ప్రభుత్వ నియమాలతో స్పీడు బ్రేకర్లును ఏర్పాటు చేస్తామని తెలిపారు.

కిమ్స్‌లో అరుదైన గుండె శస్త్ర చికిత్స

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : కిమ్స్ ఆసుపత్రిలో అరుదైన గుండె శస్త్ర చికిత్స చేసినట్లు ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాసరాజు, డాక్టర్ నాగరాజరావులు తెలిపారు. శుక్రవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మనుబోలు మండలానికి చెందిన చిట్టిబాబు (43)కు నిమిషానికి 350 నుంచి 400 సార్లు గుండె కొట్టుకున్నట్లుగా గుర్తించామన్నారు. గుండెకు స్టంట్ కూడా వేశామని, అయితే గుండె వేగం పెరగటంతో 10 సార్లు కరెంటు షాక్ ఇచ్చి అల్రా ఆర్టిరియల్ బెలూన్ పంపింగ్ (ఐఏబీపీ) చేసి మెడలో నరానికి ఇంజక్షన్ ద్వారా గుండె వేగాన్ని తగ్గించామన్నారు. నాలుగు రోజులు వెంటిలేటర్ చికిత్స అనంతరం బాధితుడ్ని డిశ్చార్జి చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాధితుడితోపాటు గుండె వైద్య నిపుణులు సాహెబ్‌పీర్, జగదీష్, అశోక్, చీఫ్ ఆపరేటింగ్ అధికారి సతీష్‌కుమార్, మెడికల్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉద్వాపన పూజ

నెల్లూరు (సాంస్కృతికం) : రాజరాజేశ్వరి ఆలయంలో రాహుకాల ఉద్వాపన పూజలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని రాహుకాల దీపాలు వెలిగించి 18 వారాలు పూర్తి చేసుకుని తదుపరి 19వ వారం, 42 మంది భక్తులు రాహుకాల ఉద్వాపన పూజలో పాల్గొని శ్రీఅమ్మవారికి 108 నిమ్మకాయల మాల, చీర, జాకెట్, పసుపు కుంకుమ సమర్పించారు.

పొంచి ఉన్న ప్రమాదాలు

నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్డు, డ్రైనేజీ పనులు పూర్తయ్యాక పూడ్చకుండా వదిలేస్తున్న గుంతలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. వాహన చోదకులు ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలకు గురికావాల్సిందే. ఈ గుంతల్లో వాహనాలు పడి ప్రమాదాలు జరిగినా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్



మినీ బైపాస్ రోడ్డులో టీడీపీ కార్యాలయం సమీపంలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా పెద్ద గుంత



పొదలకూరు రోడ్డులో కలెక్టర్ బంగ్లా సమీపంలో రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా తాగునీటి పైపులైన్ గుంత



వాకర్స్ రోడ్డులో కాలువ కట్ట లేక ప్రమాదకరంగా మారిన రాహదారి

దివ్యాంగ పిల్లలకు బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ

నెల్లూరురూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన దివ్యాంగ పిల్లలకు సర్వ శిక్ష అభియాన్ ద్వారా బ్యాటరీ ట్రైసైకిళ్లు మంజూ రయ్యాయి. వీటిని శుక్రవారం నెల్లూరురూరల్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ విజయకుమార్‌తో కలిసి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలున్న పిల్లలను ఆదుకోవడం ఓ అద్భుత అవకాశమన్నారు. వారికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. నడవలేని స్థితిలో ఉన్న వీరికి బ్యాటరీ సైకిళ్లు ఎంతగానో దోహదపడతాయన్నారు.



దివ్యాంగ పిల్లలకు బ్యాటరీ ట్రై సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

● చేనేతలకు చేయూత

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే చేనేత కార్మికులకు చేయూత అందిందని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. గడప గడపకు కార్యక్రమంలో భాగంగా ఆయన నారాయణరెడ్డిపేటలోని చేనేత కుటుంబాలను ఇంటింటికి వెళ్లి పలకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. నేతన్నలకు వృత్తి పరంగా అనేక ప్రోత్సాహకాలను అందించింది టీడీపీ ప్రభుత్వంలోనేనని స్పష్టం చేశారు. ఆదారణ ద్వారా పరికరాలు ఇవ్వడం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించి ఆర్థికంగా ఇబ్బందుల నుంచి తప్పించామన్నారు.

విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు శిక్షణ ఇవ్వాలి



పరిశ్రమల శాఖ జీఎం ప్రసాద్‌ను కలిసిన విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి (పీఎం) విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు శిక్షణ ఇవ్వాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాజన వెంకటశేషయ్య ఆచారి కోరారు. ఈ మేరకు శుక్రవారం సంఘం నాయకులతో కలసి జిల్లా పరిశ్రమలశాఖ కార్యాలయంలో జీఎం ప్రసాద్‌కు వినతిపత్రం అందచేశారు. ఆ సందర్భంగా వెంకటశేషయ్య ఆచారి మాట్లాడుతూ ఈ పథకం లబ్ధికోసం అనేక మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. కొంతమందికి శిక్షణ ఇచ్చినా రూ.4వేల స్టైఫండ్ ఇవ్వలేదన్నారు. బ్యాంకు రుణాలు ఇవ్వకపోగా సరైన సమాధానం చెప్పడం లేదన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లూరు హరిబాబు ఆచారి, సోడా నారాయణ ఆచారి, లంకెనపల్లి సుబ్బయ్య ఆచారి, కళ్యాణ్ ఆచారి పాల్గొన్నారు.

మంత్రి పార్థసారథికి ఎమ్మెల్యేల ఆత్మీయ స్వాగతం

నెల్లూరు(వైద్యం/హరనాథపురం), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నెల్లూరుకు వచ్చిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథిని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు శుక్రవారం ఆత్మీయ స్వాగతం పలికారు. అల్లీపురంలోని సోమిరెడ్డి నివాసానికి వచ్చిన ఆయనకు. సోమిరెడ్డితో పాటు ఆయన కుమారుడు రాజగోపాల్‌రెడ్డి స్వాగతం పలికారు. అలాగే నగరంలోని తన నివాసానికి వచ్చిన మంత్రికి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పుష్పగుచ్ఛం అందచేసి ఆత్మీయ స్వాగతం పలికారు. మంత్రి వెంట కావలి, ఉదయగిరి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేలు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సరేష్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

● జిల్లా అదనపు మలేరియా అధికారి నాగార్జునరావు

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అతిసారితో పాటు కీటక జనీత వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగిన జాగ్ర త్తలు తీసుకోవాలని జిల్లా అదనపు మలేరి యా నివారణ అధికారి నారార్జునరావు తెలిపారు. శుక్రవారం నగరంలోని బాలాజీ నగర్ సచివాలయం పరిధిలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రాంతం లో ఇంటింటికి తిరిగి నీటి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ నీటి నిల్వల వల్ల దోమల లార్వా పెరిగే అవకాశం ఉందన్నారు. తద్వారా ప్రా ణాంతక వ్యాధులు వస్తాయని హెచ్చరించారు. ఈ సీజన్‌లో అతిసార వంటి వ్యాధి వచ్చే అవకాశం ఉందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికారి రామారావు, ఏఎన్‌ఎం, ఆశా లు పాల్గొన్నారు.

మ్యారేజీ మీడియా సమావేశం

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని టౌనుహాలులో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ మ్యారేజీ మీడియా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కృష్ణారెడ్డితో పాటు రాష్ట్రం నలు మూలల నుంచి మ్యారేజీ బ్యూరోల ప్రతి నిధులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పి.సుధాకర్‌రెడ్డి, నాయకులు పి.పుల్లారెడ్డి, మధుసూదన్‌యాదవ్, పి.విజయభాస్కర్‌రెడ్డి, సీహెచ్.మమతారెడ్డి, ఎంవీ.రమణయ్య, పి.పద్మావతమ్మ, పి.మస్తాన్‌రెడ్డి, జి.ప్రభాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యతోనే ఉపాధి అవకాశాలు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందివడం ద్వారానే ఆదిశంకర విద్యాసంస్థలలోని విద్యార్థులు పలురంగాలలో ఇంజనీర్లుగా రాణిస్తున్నారని రాష్ట్రమంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో విద్యాసంస్థల సిల్వర్‌జూబ్లీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణప్రాంతాలలోని విద్యార్థులకు నైపుణ్యలతో కూడిన విద్యను అందిచాలనే లక్ష్యంతో ఈ కళాశాలను స్థాపించడం అభినందనీయమన్నారు. విద్యాసంస్థల చైర్మన్ వంకి పెంచలయ్య విద్యసంస్థల తోపాటు పర్యావరణ పరిరక్షణకు, తాబేళ్ల సంరక్షణకు, విద్యార్థుల్లో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు, యోగాలో మెలుకవలు నేర్పేందుకు చర్యలు తీసుకోవడం శుభపరిణామమన్నారు. విద్యకు సాంకేతికతను నైపుణ్యాలను జోడిస్తే సంపదను సృష్టించవచ్చునని, ఇందుకు స్థిరత్వం కలిగిన సీఎం చంద్రబాబునాయుడు ఆహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు మెరుగైన విద్యను అందించడంతోపాటు నైపుణ్యాలను పెంపొందించేందుకు స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్లును ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ప్రపంచంలోని వివిధ బహుళజాతి కంపెనీలను మన రాష్ట్రానికి ఆహ్వానించి విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. 25 ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఆదిశంకర విద్యాసంస్థలను ఏర్పాటు ఎంతో మంది విద్యార్థులు కళాశాల నుంచి నేడు ఉన్నత స్థితికి చేరుకునేందుకు కృషిచేస్తున్న చైర్మన్‌ను అభినం దిస్తున్నామన్నారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకుని దేశం గర్వించదగ్గ ఇంజనీర్లుగా ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, జబర్దస్త్ టీం నాటికలు, వందేమాతరం శ్రీనివాస్ గేయాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తమిళనాడు మంత్రి రాజక న్నప్పన్, మాజీ మంత్రి పరసారత్నం, విద్యాసం స్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య, వంకి ప్రసూన, వంకి అరవింద, వంకి అనూష, వంకి ఐశ్వర్య, రాజమురుగదాస్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి, వేదకపై మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, పాశం, ప్రముఖులు



శ్రీనివాస కల్యాణం నాటిక ప్రదర్శన

ఐదు బీసీ హాస్టళ్లకు నీటిశుద్ధి పరికరాలు

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఐదు బీసీ సంక్షేమ వసతి గృహాలకు నెల్లూరులోని కెనరాబ్యాంకు ప్రాంతీయ కార్యాలయం అధికారులు ప్యూరిఫైడ్ యంత్రాలను బహూకరించారు. వీటిని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ కార్తీక్ అందజేశారు. అదేవిధంగా మూడు జడ్పీ పాఠశాలలకు స్పోర్ట్సు కిట్లను అందజేశారు. అలాగే ఎస్ఎస్ఏ సమన్వయంతో జడ్పీ ఉన్నత పాఠశాలలకు 7 కంప్యూటర్లు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ కార్తీక్ కెనరా బ్యాంకు వారి సామాజిక బాధ్యతను అభినందించారు. ఈ కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్ కుమార్, డీఆర్‌వో ఉదయభాస్కర్ రావు, జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్యూరిఫైడ్ యంత్రం అందజేస్తున్న జేసీ కార్తీక్, కెనరాబ్యాంకు అధికారులు

వివాహ సంబంధం కుదర్చడం దైవకార్యమే..

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): యువతీ యువకులకు మంచి వివాహ సంబంధాలు కుదర్చడం దైవకార్యమేనని కోడూరు హరినారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధినేత, న్యూ సమైక్య మ్యారేజీ మీడియేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ గౌరవాధ్యక్షుడు కోడూరు హరినారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం దండువారివీధిలో ఆ అసోసియేషన్ జిల్లా శాఖను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాటాడుతూ తాను దేశ విదేశాల్లో దాదాపు 5 వేలకుపై వివాహ సంబంధాలు కుదిర్చానని తెలిపారు. తమ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలో మంచిపేరు తెచ్చుకుందన్నారు. జిల్లా శాఖ అధ్యక్షుడు గున్నం శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెంకటాద్రి, రత్నమ్మ, సరళ, వెంకటేశ్వర్లు, వాణి, లక్ష్మీ ప్రసన్న, మేఘన, కృష్ణప్రియ, రవి, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కోడూరు హరినారాయణరెడ్డి

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు ఆమోదంపై సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ శ్రేణులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు ఆమోదంపై నగరంలోని చిన్నబజారులో ఉన్న బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు యశ్వంత్‌సింగ్ మాట్లాడుతూ బిల్లును ప్రవేశపెట్టిన యూనియన్ మైనార్టీ అఫైర్స్ మంత్రి కిరణ్‌రిజూజూకు, బిల్లుకు ఓటు వేసి మద్దతు తెలిపిన ఎంపీలకు ఆయన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముస్లీం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింల నిరసన

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ సరవణ బిల్లును వ్యతిరేకిస్తూ నగరంలోని పెద్దబజారు అహ్మదీయా మసీదు ప్రాంతంలో ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు మహ్మద్ జియాఉల్‌హక్ ఆధ్వర్యంలో ముస్లింలు శుక్రవారం నిరసన తెలిపారు. ఆ బిల్లు లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదం పొందినా దీనిని రాజ్యాంగ వ్యతిరేకంగా భావిస్తున్నామన్నారు. ఈ బిల్లు మత స్వేచ్ఛ, సమానత్వం, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసిందని ఆరోపించారు. వివక్షతో కూడుకున్న ఈ నల్ల చట్టాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నాయకులు షేక్ సిద్ధిక్, సీపీఐ నాయకులు సయ్యద్ ఐరాజ్, కోస్తాంధ్ర మైనార్టీ రైట్స్ అధ్యక్షుడు మొహమ్మద్ ఉమర్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ అజీజ్, మొహ్మద్ సాహుల్, అమానుల్లా, అంజాద్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జియా ఉల్ హక్, ముస్లిం నాయకులు



కందిపప్పు కొందరికే

- డిమాండ్ 530 టన్నులు.. వచ్చింది 210
- అరకొరగా సరఫరా చేస్తున్న డీలర్లు
- చక్కెర పరిస్థితీ అంతే

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో ఈనెల కందిపప్పు దాదాపు 40 శాతానికే అందుతోంది. డిమాండుకు తగ్గ సరఫరా లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. పలువురు కార్డుదారులు కందిపప్పు కోసం డిమాండు చేస్తున్నారు. జిల్లాలోని 1457 రేషన్ దుకాణాల పరిధిలో దాదాపు 5,91,318 కార్డులకు 530 టన్నుల కందిపప్పు అవసరం. అయితే 210 టన్నులు మాత్రమే సరఫరా అయింది. తెలుగు రాష్ట్రాల్లో కందుల దిగుబడి భారీగా తగ్గిపోవడమే కారణమని చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాలన్నా అక్కడా ఇదే కొరత పట్టి పీడిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వచ్చిన కొద్దిపాటి కందిపప్పునూ డీలర్లు ఎంతమందికి ఇస్తున్నారన్నది ప్రశ్నార్థకం. కొందరు డీలర్లు కందిపప్పునకూ బయోమెట్రిక్‌లో కార్డుదారుల వేలి ముద్ర వేయించుకుని ఇవ్వడంలేదన్న ఆరోపణలున్నాయి. స్టాక్ రాలేదని చెబుతున్నారట. ఎవరైనా గట్టిగా నిలదీస్తే.. అలాంటి వారికి ఇస్తున్నట్లు తెలిసింది. ఇక, చక్కెర కూడా 400 టన్నులు అవసరం కాగా, 175 టన్నులే సరఫరా అయింది. 'జిల్లాకు అవసరమైన కందిపప్పు, చక్కెర రాలేదు. దీంతో పూర్తి స్థాయిలో కార్డుదారులకు పంపిణీ చేయడం కష్టంగా ఉంది. దీనిపై కలెక్టర్, జేసీకి నివేదికలు సమర్పించాం. ప్రభుత్వంతో మాట్లాడి తెప్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. కొన్ని చోట్ల బియ్యానికి బదులు జొన్నలు పంపిణీ చేస్తున్నారు' అని డీఎస్‌వో శేషాచలం రాజు తెలిపారు.



ధ్వజావరోహణం, చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

వేడుకగా కోదండరాముడి చక్రస్నానం

- ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఉదయం 7.30 గంటలకు లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవర్లను పల్లకిలో ఊరేగింపుగా కపిలతీర్థం ఆలయానికి వేంచేపు చేశారు. 9 నుంచి 10.30 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు, చక్రత్తాళ్వార్లకు వేణుగోపాల స్వామి ఆలయ మండపంలో స్నపన తిరుమంజనం.. అనంతరం పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు. కపిలతీర్థం నుంచి స్వామివారు గోవిందరాజ స్వామి ఉన్నత పాఠశాలలోని పీఆర్ తోటకు వేంచేపు చేశారు. సాయంత్రం అక్కడి నుంచి బయలుదేరి తీర్థకట్టవీధి, కోటకొమ్మలవీధి, కొత్తవీధి మీదుగా కోదండరామాలయానికి చేరుకున్నారు. మార్గమధ్యంలో ఆంజనేయస్వామి, వైఖానసాచార్యుల ఆలయాల్లో ఆస్థానం చేపట్టారు. రాత్రి 8.30 నుంచి 9.30 గంటల నడుమ ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

మాట ప్రకారం ఉచిత సిలిండర్ల పంపిణీ: నాదెండ్ల



ఈశ్వరమ్మకు గ్యాస్‌సిలిండ్ అందజేస్తున్న మంత్రి, తదితరులు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో చెప్పిన మాట ప్రకారం దీపం-2 పథకం ద్వారా లబ్ధిదారులకు ఉచిత సిలిండర్లు పంపిణీ చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తిరుపతి నగరం శ్రీకృష్ణదేవరాయల వీధిలో ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, ప్రభుత్వ విప్ శ్రీధర్, కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభంబన్సల్‌తో కలసి ఆయన శుక్రవారం రాత్రి లబ్ధిదారు డి.చిన్నఈశ్వరమ్మకు సిలిండర్ పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామ్మోహన్, సివిల్ సప్లయిస్ డీఎం సుమతి, డీఎస్వో శేషగిరిరాజు, జనసేన జిల్లా, నగరాధ్యక్షులు పి.హరిప్రసాద్, రాజారెడ్డి, ఇతర కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ఉరుసులో జనసందోహం



ఊరేగింపుగా వస్తున్న గంధం

వైభవంగా ఉరుసు మహోత్సవం

నాయుడుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో ఎనిమిదేళ్ల తర్వాత హజరత్ అమీర్‌షావలి దర్గా గంధోత్సవం, ఉరుసు జరుగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున దొర్నాదుల చెంచుకృష్ణయ్య నివాసం నుంచి మంగళవాయిద్యాల నడుమ గంధం ఊరేగింపుగా బయలుదేరి.. హజరత్ అమీర్‌షావలి దర్గా వద్దకు చేరుకుంది. రాపూరుకు చెందిన సయ్యద్ నూర్‌షావలిచే చదివింపులు కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీ, ఉరుసు దర్గా కమిటీ చైర్మన్ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ ఆధ్వర్యంలో గంధం పంపిణీ చేశారు. సాయంత్రం దర్గాతోపాటు ఆ ప్రాంతమంతా విద్యుద్దీపాలతో మిరుమిట్లు గొలిపాయి. భక్తులు బారులుతీరి అమీర్‌షావలి దర్గాను దర్శించుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా రద్దీగా మారింది. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి, తదితరులు దర్గాను దర్శించుకున్నారు. పాటకచేరి విశేషంగా ఆకట్టుకుంది. ఉరుసులో అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

టీడీఆర్ స్పెషల్ డ్రైవ్‌కు క్యూకట్టిన బాధితులు

- 35 మందికి ప్రీ అప్రూవల్
- వైసీపీ అడ్డగోలుతనంపై పలువురి ఆవేదన
- వారం రోజులపాటు కొనసాగనున్న కార్యక్రమం

మాస్టర్ ప్లాన్ రోడ్లకోసం పోగొట్టుకున్న ఆస్తులు	1074
ఇప్పటివరకు టీడీఆర్ బాండ్లు ఇచ్చినవి	443
ఇవ్వాల్సిన టీడీఆర్ బాండ్లు	631
పరిశీలనలో ఉన్న దరఖాస్తులు	214
టీడీఆర్ పోర్టల్‌లో అప్‌లోడైన ఆస్తులు	412

తిరుపతి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన వారి టీడీఆర్ బాండ్ల దరఖాస్తుల ధ్రువీకరణ స్పెషల్ డ్రైవ్ శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రారంభమైంది. దాదాపు వందమందికి పైగా బాధితులు క్యూ కట్టారు. ఇదివరకే 45 మందికి ప్రీ అప్రూవల్ ఇవ్వగా, ఇప్పుడు మరో 35 మందికి ఆన్‌లైన్లో లాగిన్ చేశారు. ఒక్కో రోడ్డుకు సంబంధించి వేర్వేరుగా జాబితాలు తయారుచేసి దరఖాస్తులు స్వీకరించారు. భూతగాదాలున్న వాటిని మరోసారి పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు చెప్పారు. తొలి రోజు ప్రారంభంలో స్పెషల్ డ్రైవ్ కాస్త గందరగోళంగా మొదలైంది. బాధితులకు సరైన సమాధానం, భరోసా ఇవ్వడంలో విఫలమైనట్టు కనిపించింది. కార్పొరేషన్‌కు గిఫ్ట్‌డీడ్ ఇచ్చినవాటికి టీడీఆర్ బాండ్లు ఇవ్వడం సాధ్యపడదని చెప్పడంతో కొందరు ఖంగుతిన్నారు. తిరుపతి, రేణిగుంట సబ్ రిజిస్ట్రార్లతో గిఫ్ట్ డీడ్‌లకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలింపచేశారు. టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొని టీడీఆర్ బాండ్ల దరఖాస్తులను పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల వారీగా వివరాలు సేకరించారు. టీడీఆర్ బాండ్ల దరఖాస్తుల పరిశీలన, వాలిడేషన్, రిజిస్ట్రేషన్ చేసే విధానంపై వివరించారు. వైసీపీ నేతలు అడ్డగోలుగా మాస్టర్ ప్లాన్ రోడ్లువేసి, న్యాయం చేస్తామని నమ్మించి మోసం చేశారని ఈసందర్భంగా పలువురు లబ్ధిదారులు ఆవేదన చెందారు. ఈ స్పెషల్ డ్రైవ్ వారం రోజులపాటు కొనసాగనుంది.

పారదర్శకంగా దరఖాస్తుల పరిశీలన

టీడీఆర్ దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి, ఆన్‌లైన్ ద్వారా నమోదు చేస్తున్నట్లు కమిషనర్ మౌర్య మీడియాకు చెప్పారు. ఆ తర్వాత కమిటీ పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇస్తామని, తర్వాత గిఫ్ట్ డీడ్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. గతంలో ఎక్కువ మంది నివాస యోగ్యమైన స్థలాలకు కమర్షియల్ డోర్ నంబర్‌తో రిజిస్టర్ చేశారన్నారు. అటువంటి వాటిని, సరైన ధ్రువ పత్రాలు జతపరచని వాటిని షార్ట్ ఫాల్ చేశామన్నారు. వీరందరూ సరైన ధ్రువపత్రాలతో వస్తే ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు. ఇదివరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 9 దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించగా ఒకదానికి మాత్రమే సరైనదిగా గుర్తించి, తక్కిన ఎనిమిదింటికి అవసరమైన డాక్యుమెంట్లు తీసుకురావాలని షార్ట్‌ఫాల్ లిస్ట్‌లో పెట్టారు. ఈ మేళాలో తిరుపతి, రేణిగుంట సబ్ రిజిస్ట్రార్లు, డీసీపీ మహాపాత్ర, ఏసీపీలు బాలాజీ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.





టీడీఆర్ బాండ్ల స్పెషల్ డ్రైవ్‌కు హాజరైన బాధితులు - దరఖాస్తులను పరిశీలిస్తున్న టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, కమిషనరు మౌర్య

న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం



చింతలచేనులో 1996 నుంచి రిజిస్ట్రేషన్ జరిగిన భూమిని 2006లో కొన్నాం. మాస్టర్ ప్లాన్ రోడ్డుకు మా స్థలం పోతుంటే అభ్యంతరం చెబితే, అభినయ్ రెడ్డి మమ్మల్ని నమ్మించి మోసం చేశారు. రోడ్డుకు అంగీకరించిన తర్వాత మా స్థలం 22ఏ (నిషేధిత జాబితా)లో ఉందని చావుకబురు చెప్పారు. ఆవేదనతో నా భర్తను కోల్పోయా. గత వైసీపీ హయాం నుంచి అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నా. న్యాయం జరగకపోతే ఇక చావే శరణ్యం.

\- నిర్మల

నోటీసులివ్వకుండా రోడ్డేశారు



మాకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రోడ్లు వేశారు. మా స్థలాలను దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు. నేను తెలుసుకుని వెళ్లి అడిగితే డాక్యుమెంట్లు తీసుకుని మున్సిపల్ కార్యాలయానికి రమ్మన్నారు. ఏడాదిపాటు తిప్పుకున్నారు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్థలానికి ఇబ్బంది లేకుండా రోడ్డు వేయడంతో కమర్షియల్ విలువ రావాల్సిన మా స్థలం రెసిడెన్షియల్ పరిధిలోకి వెళ్లింది. మాకు ఆధారమైన వంద అంకణాల స్థలం పోయింది. దానికి ప్రత్యామ్నాయంగా టీడీఆర్ బాండ్లు ఇస్తే వాటితో ఏం చేసుకోగలం.

\- సుమాంజలి

ఆరడుగుల స్థలం మిగిల్చారు



హీరో షోరూం సమీపంలో 1987లో 200 చదరపు మీటర్ల స్థలం కొని ప్రహరీ కట్టి భద్రపరుచుకున్నా. మూడేళ్ల కిందట మాస్టర్ ప్లాన్ రోడ్డువేసి.. రోడ్డుకు ఆరు అడుగుల వెడల్పుతో అడ్డదిడ్డమైన పొడవుతో కొంత స్థలాన్ని మిగిల్చారు. తీసుకుంటే మొత్తం తీసుకోండి. దానిని నేనేమి చేసుకోగలనని అధికారులకు వినతిపత్రాలు ఇస్తూనే ఉన్నా. కానీ న్యాయం జరగలేదు. ఇప్పుడైనా జరుగుతుందని వచ్చా.

\- శంకర్ నాయుడు

కోర్ బ్రాంచిలే అసలైన ఆవిష్కరణకు పునాదులు

- రానున్న నాలుగేళ్లలో వీటికి మరింత డిమాండ్
- స్పష్టం చేసిన ముఖ్య అతిథి ఆర్వీ చక్రపాణి
- విజనరీ సీఎం ఆధ్వర్యంలో ఐఐటీ మరింత పురోగతి సాధిస్తుందన్న డైరెక్టర్

తిరుపతి(విద్య), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అసలైన ఆవిష్కరణకు పునాదులు ఇంజినీరింగ్‌లోని కోర్ బ్రాంచ్‌లేనని ఆర్వీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ లిమిటెడ్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ ఆర్వీ చక్రపాణి స్పష్టంచేశారు. తిరుపతి ఐఐటీ 10వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఐఐటీ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం విద్యార్థులందరూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్ విభాగాల్లో చేరేందుకు పోటీ పడుతున్నారని, ఐతే ఇంజినీరంగ్‌లో కోర్ బ్రాంచిలైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచిలు లేకుండా ఏఐ, డేటాసైన్స్ మనలేవన్నారు. అందుకని ఏఐ, డేటా సైన్స్ తీసుకున్నప్పటికీ కోర్ బ్రాంచిల్లో బేసిక్స్‌పై పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు. అప్పుడే సాంకేతికంగా మంచి ఆవిష్కరణలు సాధ్యమవుతాయన్నారు. ప్రస్తుతం కోర్ బ్రాంచిల కంటే ఏఐ, డేటాసైన్స్ వారికే ప్యాకేజి అధికంగా ఉంటోందని, అయితే, రానున్న నాలుగేళ్లలో ఇంజినీరింగ్ రంగంలో పెను మార్పులు జరిగి కోర్‌బ్రాంచిలకు డిమాండ్ బాగా పెరుగుతుందని చెప్పారు. దీనికిగాను దేశంలోని అన్ని ఐఐటీలను కలుపుకొని ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన వర్క్‌షాప్‌ను తిరుపతి ఐఐటీలోనూ త్వరలో నిర్వహిస్తామన్నారు.



వేదికపై మాట్లాడుతున్న ముఖ్య అతిథి ఆర్వీ చక్రపాణి

విజనరీ ముఖ్యమంత్రి టెక్ సేవీ

దీనికిముందు ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ.. పదేళ్లకాలంలో తిరుపతి ఐఐటీ ఒక్కొక్కటిగా అనేక మైలురాళ్లను అధిగమించిందంటూ వివరించారు. దీనికి చెన్నై ఐఐటీ, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో సహకరించాయన్నారు. చంద్రబాబు నాయుడిని విజనరీ ముఖ్యమంత్రిగా, టెక్ సేవీగా ఆయన అభివర్ణించారు. ఆయన నేతృత్వంలో మన ఐఐటీ మరిన్ని ఆవిష్కరణలు చేస్తుందన్నారు. అమరావతిలోని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లో తిరుపతి ఐఐటీ కూడా ఒక కీలక భాగస్వామిగా ఉందన్నారు. హబ్ ద్వారా సాంకేతిక పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ఐఐటీ మరిన్ని మైలురాళ్లను అధిగమిస్తుందన్నారు. వచ్చే నెలలో తిరుపతి ఐఐటీని సీఎం చంద్రబాబు సందర్శించనున్నారని, అప్పుడు భవిష్యత్ ప్రణాళికలను వెల్లడిస్తామన్నారు.

అవార్డుల ప్రదానం

బీటెక్‌లో ఓవరాల్‌గా ప్రతిభ చూపి, మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు మెరిట్ అవార్డులు అందజేశారు. అలాగే సిబ్బందికి స్టాఫ్ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. తిరుపతి ఐఐటీ అభివృద్ధికి పాటుపడినందుకుగాను సిబ్బంది రమేష్ (ఏఆర్), విజయ్ (సెక్షన్ ఆఫీసర్), ఇషాక్ అలీఖాన్ (జేటీఎస్), సెంథిల్ (సీనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్)కు అవార్డులు లభించాయి.



ఆలయం ముందు పూజాహెగ్డే

తిరుమలేశుని సేవలో బుట్టబొమ్మ

హీరోయిన్ పూజా హెగ్డే శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజాము ఆలయంలో జరిగిన సుప్రభాతసేవలో ఆమె కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. దర్శనం తర్వాత పూజా హెగ్డే ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. మే 1వ తేదీన తన 'రెట్రో' చిత్రం విడుదల కానుందని తెలిపారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

టీటీడీకి విరాళంగా మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వ్యాన్లు

టీటీడీకి శుక్రవారం రెండు మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వ్యాన్లు విరాళంగా అందాయి. అన్నప్రసాదాలను భక్తులకు పంపిణీ చేసేందుకు వీలుగా బెంగళూరులోని ఎంఎస్ రామయ్య విద్యాసంస్థలకు చెందిన ఎంఎస్ సుందర్ రామ్ అనే భక్తుడు రూ.45 లక్షల విలువైన రెండు అశోక్ లేల్యాండ్ బడాదోస్త్ మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వ్యాన్లను అందజేశారు. ఆలయం ముందు ఈ వాహనాలకు పూజలు నిర్వహించి, తాళాలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందించారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న సమయంలో క్యూలైన్ వెంబడి ప్రసాదాలు, తాగునీరు అందించేందుకు ఈ వ్యాన్లు ఉపయుక్తంగా ఉంటాయని వెంకయ్య చౌదరి తెలిపారు. వాహనంలో ఒకేసారి మూడు వేల మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ట్రాన్స్‌పోర్టు డిపో మేనేజర్ లక్ష్మీప్రసన్న, ఇన్‌చార్జ్ డీఐ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 21 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.51కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,864

తలనీలాలు సమర్పించినవారు: 25,784







నైపుణ్య శిక్షణ.. భవితకు రక్షణ

- అన్ని వయస్సుల వారూ కంప్యూటర్ నేర్చుకునే అవకాశం
- తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో ప్రారంభం

నేను తిరుపతి బర్డ్ ఆసుపత్రిలో పని చేస్తున్నాను. నాకు ఉద్యోగంలో కంప్యూటర్ నాలెడ్జ్ అవసరం. ఇక్కడ నేర్పిస్తున్నారని తెలిసింది. శిక్షణ తీసుకుంటున్నాను. దీని వల్ల నాకు ఉద్యోగంలో ఎంతో ఉపయోగం అవుతుంది.

- నాగమణి బాయి



నేను ఆర్టీసీలో రిటైరయ్యాను. నేను ఉద్యోగం చేసే సమయంలో కంప్యూటర్ అవసరం పెద్దగా పడలేదు. ఇప్పుడు కంప్యూటర్ అన్ని చోట్లా అవసరం అయి పోయింది. నాకూ నేర్చుకోవాలనిపించింది. నేను నేర్చుకుంటే నా మనవళ్లు, మనవరాళ్లకు నేర్పించగలను.

- రెడ్డప్ప



తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

నిత్యజీవితంలో కంప్యూటర్ ఒక భాగంగా అమరిపోయింది. చదువులో, ఉద్యోగంలో, వ్యాపారంలో ఒక అవసరంగా మారిపోయింది. కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడం వెనుకబాటుతనంగా ఆత్మన్యూనతను పెంచుతోంది. ఒళ్లో ల్యాప్‌టాప్ పెట్టుకుని కీబోర్డు మీద టకటకలాడించే పిల్లలకూ, వంటావార్పూ పనుల్లో సతమతమయ్యే పెద్దలకూ నడుమ కనిపించని అగాథం పెరుగుతోంది. సర్వ ప్రపంచాన్నీ, సకల సమాచారాన్నీ తనలో ఇముడ్చుకున్న ఆ బుల్లిపెట్టెకు దగ్గర కావడం ఎలాగో తెలీక చాలా మంది అవస్థ పడుతుంటారు. కిరాణా దుకాణాల మొదలు, బట్టల షాపుల దాకా ఎక్కడ పనికోసం వెళ్లినా.. కంప్యూటర్ వచ్చా అని అడుగుతారు. దీంతో చిన్న చిన్న చదువుల దగ్గర ఆగిపోయినవారు అవస్థ పడుతుంటారు. ఇటువంటి వారి కోసమే తిరుపతిలో వేమన విజ్ఞాన కేంద్రం ఒక వినూత్న ప్రయత్నం ప్రారంభించింది. వేసవిలో కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. ఎవరైనా ఇక్కడ కంప్యూటర్ శిక్షణ పొందవచ్చు. కంప్యూటర్‌పై అవగాహన కలిగించడం, అవసరాన్ని బట్టి తగిన కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం వీరి ఉద్దేశ్యం. సన్నాబన్నా ప్రజలకు ఇదో మంచి అవకాశం.



నేను పదో తరగతి పరీక్షలు పూర్తి చేశాను. ఇంట్లో ఖాళీగా ఉండడం కంటే కంప్యూటర్ శిక్షణ తీసుకోవడం మేలు. బయట చూసిన సెంటర్ల కంటే ఇక్కడ కంప్యూటర్లు చాలా ఉన్నాయి. శిక్షణ చాలా బాగుంది. ఇంటర్‌లో చేరేటప్పటికే బేసిక్స్ నేర్చుకునేందుకు నాకు వీలు కలుగుతోంది.

- కావ్య

అర్హత: 7వ తరగతి దాకా చదువుకుని ఉంటే చాలు
కోర్సులు: ఎంఎస్ ఆఫీస్, ఎంఎస్ వర్డ్, ఎంఎస్ ఎక్సెల్ , ట్యాలీ
తరగతులు: ఉదయం 8గంటలకు ట్యాలీపై శిక్షణ. సాయంత్రం కంప్యూటర్ ప్రాథమిక పరిజ్ఞానం
బ్యాచ్‌లు: ఉదయం 8 నుంచి ఒక బ్యాచ్. సాయంత్రం 4 నుంచి 6 దాకా ఒక బ్యాచ్. 6 నుంచి రాత్రి 8 దాకా ఒక బ్యాచ్.
వయసు: ఏ వయసు వారికైనా శిక్షణ ఇస్తారు.
వివరాలకు: 99665 84759, 89850 80370

మార్చి 30న లాంఛనంగా తిరుపతి యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ తరగతులు మొదలయ్యాయి. ఈ నెల 2 నుంచీ బ్యాచ్‌ల వారీగా శిక్షణ ప్రారంభించారు. చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్నవారూ, పేద విద్యార్థులు, గృహిణులు, రిటైరైన ఉద్యోగులు శిక్షణ తరగతులకు హాజరవుతున్నారు. ప్రస్తుతం 25 కంప్యూటర్లు ఉన్నాయి. వీటి సంఖ్యను మరింత పెంచే ఆలోచనలో ఉన్నారు. పెద్దవాళ్లు కూడా పిల్లల్లా మారి కంప్యూటర్ గురించి తెలుసుకుంటున్నారు.



నేనేమీ ఉద్యోగం చేయడం లేదు కానీ ఎక్కడ చూసినా కంప్యూటర్‌లే ఉంటున్నాయి. నాకూ వాటి గురించి తెలుసుకోవాలనిపించింది. వేమన విజ్ఞాన కేంద్రంలో నేర్పిస్తారని తెలిసి వస్తున్నాను. నేను నేర్చుకోవడం నా పిల్లలకు కూడా ఉపయోగపడుతుంది.

- నాగమణి



చాలా ఉపయోగకరం



వేమన విజ్ఞాన కేంద్రం చేస్తున్న అనేక కార్యక్రమాల్లో కంప్యూటర్ శిక్షణ కూడా ఒకటి. మరికొన్ని రోజుల్లో మరిన్ని శిక్షణలను అందుబాటులోకి తీసుకొస్తాం. ప్రస్తుతం 25 కంప్యూటర్లతో ట్యాలీ, కంప్యూటర్ బేసిక్స్‌పై శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ కావాలంటూ భిన్న వర్గాల వారు వస్తున్నారు. ఈ శిక్షణను నిరుద్యోగులు, విద్యార్థులు బాగా ఉపయోగించుకోవచ్చు. గృహిణులు, పెద్దవారికి కంప్యూటర్‌పై అవగాహన కలుగుతుంది. వారి ఆసక్తినిబట్టి కోర్సుల్లో శిక్షణ పొందవచ్చు. కంప్యూటర్ కోర్సులు నేర్చుకుంటే ఇంట్లో నుంచీ డబ్బులు సంపాదించే అవకాశాలు ఉన్నాయి.

- పంచముఖేశ్వరరావు, కేంద్రం ఇన్‌చార్జి

తిరుపతి- పళణి బస్సు ప్రారంభం



తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి- పళణి బస్సు శుక్రవారం రాత్రి బయలుదేరింది. ఈ సర్వీసును డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గురువారం అమరావతిలో ప్రారంభించిన విషయం తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం ఆ బస్సు శుక్రవారం రాత్రి 8 గంటలకు బయల్దేరింది. కృష్ణగిరి, పళణికి 15మంది ప్రయాణికులు ఎక్కారు. రోజూ రాత్రి 8 గంటలకు మొదలై చిత్తూరు, పలమనేరు, కుప్పం, కృష్ణగిరి, ధర్మగిరి, భవాని, ఈరోడ్ మీదుగా పళణికి మరుసటి రోజు ఉదయం 7గంటలకు చేరుకుంటుంది. అక్కడ్నుంచి రోజూ రాత్రి 9 గంటలకు ప్రారంభమై ఇదే మార్గంలో మరుసటి రోజు ఉదయం 8గంటలకు తిరుపతికి వస్తుంది. పెద్దలకు రూ.680, పిల్లలకు రూ.360 చార్జీ. రిజర్వేషన్ సౌకర్యం ఉంది.

తిరుపతి- కాట్పాడి మధ్య ఆరు ప్యాసింజర్ రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): తిరుపతి-కాట్పాడి మధ్య 5 నుంచి 22వ తేదీ వరకు ఆరు ప్యాసింజర్ రైళ్లు రద్దు చేసినట్లు జోనల్ డిప్యూటీ సీవోఎం మణికుమార్ శుక్రవారం తెలిపారు. రామాపురం రైల్వేస్టేషన్ యార్డు వద్ద చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి బ్రిడ్జి పనులు చేపడుతుండటమే దీనికి కారణమని పేర్కొన్నారు. విల్లుపురం-తిరుపతి మధ్య నడుస్తున్న (16854) ప్యాసింజరు రైలు కాట్పాడి-తిరుపతి మధ్య ఈ నెల 6, 8, 9, 10, 13, 15, 16, 17, 20, 22 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లాను సారా రహితంగా మార్చాలి

- ఎక్సైజ్ అధికారుల సమావేశంలో డైరెక్టర్ నిశాంత్‌కుమార్



జిల్లా ఎక్సైజ్ అధికారులతో సమావేశమైన డైరెక్టర్ నిశాంత్‌కుమార్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాను సారా రహితంగా మార్చాలని అధికారులను రాష్ట్ర ఎక్సైజ్ డైరెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. సీఎం చంద్రబాబు సొంత జిల్లాలో పనిచేస్తున్న అధికారులు చాలా కీలక పాత్ర పోషించాలని సూచించారు. నవోదయం-2 అమలుపై శుక్రవారం ఆయన తిరుపతిలో అధికారులతో సమావేశమయ్యారు. సారా చుక్క కనిపించకుండా చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలపైనా ఉక్కుపాదం మోపాలన్నారు. మళ్లీ మళ్లీ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం, కల్తీ మద్యంపై రావడంపై కఠినంగా వ్యవహరించాలన్నారు. దీనిపై రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ఠంగా నిఘా ఉంచాలన్నారు. హరియాణా మద్యం పట్టుకుని నిందితులను అరెస్టు చేసిన ఎక్సైజ్ అధికారులను ఆయన అభినందించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ డీసీ విజయశేఖర్, ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి, శ్రీనివాస్, ఏఈఎస్ వాసుదేవ చౌదరి, అసిస్టెంట్ కమిషనర్లు శ్రీనివాసాచ్చారి, బాలకృష్ణన్ తదితరులున్నారు. అంతకుముందు ఆయన జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు.

ఉపాధి బిల్లుల కోసం ఎంపీడీవో సంతకం ఫోర్జరీ

- ఆరిమేనిపాడు ఫీల్డ్ అసిస్టెంట్ నిర్వాకం
- టీఏతో పాటు ఇద్దరు ఎఫ్‌ఏల తొలగింపు
- వెంకటరెడ్డిపాళెం ఎఫ్‌ఏపై పోలీసు కేసు



ఉపాధి పనుల వివరాలను వెల్లడిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, పక్కన ఎంపీడీవో విజయలక్ష్మి

ఓజిలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల బిల్లుల కోసం ఎంపీడీవో సంతకాన్నే ఫోర్జరీ చేశారు. అవకతవకలు బయటపడతాయని మస్టర్లు, ఎంబుక్‌లు దాచిపెట్టారు. ఓజిలి మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. మండలంలో ఉపాధి పనుల వివరాలను పీడీ శ్రీనిస్‌ప్రసాద్ వెల్లడించారు. రూ.14.94 కోట్లతో 4లక్షల 36వేల 52 పని దినాలు కల్పించామని, ఇందులో రూ.14 కోట్ల చెల్లింపులు జరిగాయని తెలిపారు. పనుల్లో అవకతవకలకు సంబంధించి రూ.1.59 లక్షల జరిమానా విధించామని, రూ.357892 రికవరీకి ఆదేశించామన్నారు. ఆరిమేనిపాడు ఫీల్డ్ అసిస్టెంట్ బిల్లుల కోసం ఎంపీడీవో సంతకం ఫోర్జరీ చేశారని, వెంకటరెడ్డిపాళెం ఫీల్డ్ అసిస్టెంట్ తన అక్రమాలు బయటపడతాయన్న కారణంగా మస్టర్లు, ఎంబుక్ దాచి పెట్టారని తెలిపారు. ఆరిమేనిపాడు, వెంకటరెడ్డిపాళెం ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు టెక్నికల్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించినట్లు పీడీ తెలిపారు. వెంకటరెడ్డిపాళెం ఫీల్డ్ అసిస్టెంట్‌పై పోలీసు కేసు నమోదు చేయించాలని ఎంపీడీవోను ఆదేశించామన్నారు. జిల్లాలో ఓజిలి, పెళ్లకూరు మండలాల్లో ఉపాధి సిబ్బంది పనితీరు అత్యంత అధ్వానంగా ఉందన్నారు. తరచూ తనిఖీలు నిర్వహించి ప్రక్షాళన చేపట్టనున్నట్లు చెప్పారు. సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని, అదే సమయంలో ఉపాధి కూలీలు చైతన్యంతో ఉండాలన్నారు. పని చేసే ప్రాంతంలోనే మస్టర్లు ఉండాలని, పని పూర్తయిన వెంటనే మస్టర్లు వేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఏపీడీ ప్రేమకుమార్, ఏపీవోలు చిన్నయ్య, ఉషారాణి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి ఐఐటీలో విద్యార్థులకు, స్టాఫ్‌కు మెరిట్ అవార్డులు



బాలసాయి కృష్ణ - కె.వెంకటశ్రీకృష్ణ - దివ్యంత్ అనంత్ - పలక్ ఖండేల్వాల్ - దీపశిఖ - వీరైన్ సూద్ - ఎం.డెనీకుమార్‌రెడ్డి - ఎ.కృష్ణపాండే - ఎం.మేఘవర్షిణి - కె.ఈశ్వర్ వెంకటసాయి వర్మ



అరవింద్ శ్రీనివాసన్ - సుధాకర్ వెంకటాచలం - శృతి షాజీ - టి.ఆదిత్యన్ - సిద్ధార్థ్ చనం - రాజ్రీత సమంత - బి.రాజేష్‌రెడ్డి - ఒ.జ్యోత్స్న - ఎన్.యమున - పృథ్వీ




రితిక్ మండల్ - ఆకాష్ యూనియల్ - జోదీప్ రాయ్ - అనన్య మండల్ - స్టాఫ్.. ఆర్.రమేష్ - వై.విజయ్ - టి.సెంథిల్ - మహ్మద్ ఇషాక్ అలీఖాన్



తిరుపతి ఐఐటీలో శుక్రవారం చీఫ్‌గెస్ట్ ఆర్వీ చక్రపాణి, ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ నుంచి మెరిట్ అవార్డు అందుకుంటున్న విద్యార్థి శ్రీకృష్ణ మధుసూదన్

కాన్పుకోసం భార్యను తీసుకొచ్చి..!

- మద్యం తాగిన భర్త
- మందలించడంతో గొంతు కోసుకున్న వైనం



చికిత్స పొందుతున్న వెంకట కృష్ణారెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కాన్పు కోసం ఆమె.. బ్లేడుతో గొంతు కోసుకోవడంతో అతడు.. ఇలా భార్యాభర్తలిద్దరూ ఒకే ఆస్పత్రిలో చేరారు. మద్యం ఎందుకు తాగావంటూ ఆమె మందలించడంతో అతడు గొంతుకోసుకున్న ఘటన శుక్రవారం సాయంత్రం శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండు వద్ద చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వరదయ్యపాళెం మండలం తొండంబట్టు ఎంజీనగర్‌కి చెందిన వెంకటకృష్ణారెడ్డి.. ఓ ప్రైవేటు కర్మాగారంలో కార్మికుడు. ఇదే గ్రామానికి చెందిన, శ్రీసిటీలో పనిచేసే పావనిని ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. ఆరేళ్ల కిందట వారికి కుమారుడు పుట్టాడు. ఆ తర్వాత వెంకటకృష్ణారెడ్డి మద్యానికి బానిసయ్యాడు. ఆ తర్వాత నాలుగుసార్లు ఆమెకు గర్భస్రావం అయింది. ఇప్పుడు తొమ్మిది నెలల గర్భిణి. కాన్పుకోసం శ్రీకాళహస్తికి తీసుకొచ్చిన అతడు..బస్టాండు నుంచి ప్రభుత్వాస్పత్రికి వెళ్లేందుకు ఆటో కోసం వేచి ఉన్నారు. ఆ సమయంలో వెళ్లి మద్యం తాగొచ్చాడు.ఇప్పటికి నాలుగుసార్లు అబార్షన్లు అయినా ఇంకా బాధ్యతారాహిత్యంగా ఉంటే ఎలాగంటూ పావని గట్టిగా మందలించింది. రోడ్డుపైనే అతడు ఆవేశంతో బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. స్థానికులు భార్యాభర్తలను ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇదే ఆస్పత్రిలో అతడు చికిత్స పొందుతుండగా, ఆమె కాన్పు కోసం ఇక్కడే చేరారు.

విషపూరిత ఆహారం తిని విద్యార్థులకు అస్వస్థత



చికిత్స పొందుతున్న విద్యార్థులు

చిల్లకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చిల్లకూరులోని డానియల్ చిల్డ్రన్స్ హోమ్ (అనాథ పిల్లల హాస్టల్)లో శుక్రవారం విషపూరిత ఆహారం తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. బయట నుంచి గురువారం అర్ధరాత్రి కొందరు తీసుకొచ్చిన బిర్యానీని.. శుక్రవారం ఉదయం అల్పాహారంగా అందజేసినట్లు విద్యార్థులు తెలిపారు. దీనిని తినడంతో డానియల్ చిల్డ్రన్స్ వసతిగృహంలోని 11 మంది విద్యార్థులకు వాంతులు, విరోచనాలు కావడంతో అస్వస్థతకు గురయ్యారు. చికిత్స నిమిత్తం వీరిని పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. ఇద్దరు విద్యార్థులను మాత్రం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థులను గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా పరామర్శించారు. పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. విషపూరిత ఆహారం తినడం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు వైద్యులు తెలిపారు.

నేటినుంచి సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



సంగమేశ్వరాలయం

కోట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలిలోని స్వర్ణముఖినది తీరాన వెలసిన కామాక్షీదేవి సమేత సంఘమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభంకానున్నాయి. 11 రోజుల పాటు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ నెల 5న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, పుట్టబంగారం, 6న కొడి వస్త్రాలు, గ్రామోత్సవం, 7న ప్రేతవాహనసేవ, 8న హంసవాహనసేవ, 9న బృంగిసేవ, 10న రావణసేవ, 11న నందిసేవ, 12న రథోత్సవం, 13న గజవాహనంపై గ్రామోత్సవం, 14న సంగమేశ్వరుడు, కామాక్షీదేవి కల్యాణం, 14న విమానోత్సవం, 15న ఏకాంతసేవతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

ఉపాధి పనుల్లో అవకతవకలు

రూ.72,597 రికవరీ, రూ.34 వేల జరిమానా



వివరాలను వెల్లడిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

చిట్టమూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై శుక్రవారం సామాజిక తనిఖీ సభ నిర్వహించారు. డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ సమక్షంలో జరిగిన పనులు, ఖర్చు చేసిన నిధుల వివరాలు వెల్లడించారు. రూ.1,06,597 అవకతవకలు జరిగినట్లు తేలింది. ఇందులో సిబ్బంది నుంచి రూ.72,597 రికవరీకి ఆదేశించగా, రూ.34 వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పీడీ వరప్రసాద్, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఏపీవో షీలా, ఈసీ శరత్‌కుమార్, తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన టీడీపీ నేత



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

పెళ్లకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును పెళ్లకూరు మండలానికి చెందిన టీడీపీ నేత మాపూరు మురళీ నాయుడు అమరావతిలో శుక్రవారం కలిశారు. మండలంలోని గుర్రప్పతోట 71వ జాతీయ రహదారి నుంచి కప్పగుంట కండ్రిగ, పాలచ్చూరు ఎస్టీ కాలనీ వరకు బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే తనకు శ్రీకాళహస్తి ఆలయ పాలకమండలిలో సభ్యుడిగా అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రిని కారారు.

దైవభక్తి పెంపొందించుకోవాలి



వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో విశ్వప్రసన్నతీర్థస్వామి

గూడూరు అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దేశభక్తితో పాటు దైవభక్తిని పెంపొందించుకోవాలని సనాతన రత్న అవార్డు గ్రహీత విశ్వప్రసన్న తీర్థస్వామి అన్నారు. స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల వేడుకల్లో భాగంగా నూతనంగా నిర్మించిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహప్రతిష్ట చేశారు. పూర్ణాహుతి, ధ్వజస్తంభస్థాపన, కుంబాభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయానికి ప్రయత్నం ఎంత ముఖ్యమో.. దైవ వరం కూడా అంతే ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ దైవ నామస్మరణ చేసుకుంటూ నలుగురికి సాయం అందించాలన్నారు. విద్యార్థులు మంచి విజయాలు సాధిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ వంకి పెంచలయ్య, వంకి అనూష, వంకి అరవింద, వంకి ఐశ్వర్య, రాజమురుగదాస్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతి పూజ

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తోలిమిట్ట ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం ప్రధానోపాధ్యాయుడు ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. అనంతరం సరస్వతి పూజ నిర్వహించారు.

శ్రీరామనవమి ఉత్సవాల కమిటీ ఏర్పాటు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలకు కమిటీ నియమించినట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా వాకచర్ల రమేష్, సభ్యులుగా పోలూరు రాధాకృష్ణ, తుర్లపాటి శ్రీనివాసులు, ఎస్.హరిప్రసాద్, మొగళ్లూరు శ్రీలత, బట్టా మాధవి, పేర్నాటి పద్మజా కామాక్షి, మోక్షగుండం శ్రీలత, దొడ్డి భారతిను నియమించారు.

నేడు డక్కిలి మండల మీట్

డక్కిలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గుణశేఖరరెడ్డి తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు హజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తడ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మాంబట్టు, అక్కంపేట సబ్ స్టేషన్ల పరిధిలోని లైన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మురళి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.





మన్నారుపోలూరులో అసంపూర్తిగా ఉన్న భవనం - దేగలపాలెం వద్ద నాటిన శిలాఫలకం

పట్టణ ఆరోగ్య కేంద్ర భవనాలకు గ్రహణం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలందించే లక్ష్యంతో నాలుగేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. 2020లో మన్నారుపోలూరులోని టూరిజం కాంప్లెక్స్‌లో ఒకటి, గాండ్లవీధిలో ఉన్న అన్న క్యాంటీన్‌లో ఈ ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు. ఆ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్క భవనానికి రూ.80 లక్షలు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించింది. 2021లో మన్నారుపోలూరు జగనన్న లేఅవుట్‌లో ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. 65 శాతం మేర పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టరు పనులను నిలిపివేశారు. అసంపూర్తిగా ఉన్న ఆ భవనం మందుబాబులకు నిలయంగా మారింది. అదే విధంగా మరో ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి దేగపాలెం వద్ద 2022 జూన్ 30న శిలాఫలకం ఆవిష్కరించి భూమిపూజ చేశారు. తరువాత పునాది కూడా తవ్వలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభించారు. దీంతో గాండ్లవీధిలో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని సాయినగర్‌లోని అద్దె భవనంలోకి మార్చారు.

విలువలతో కూడిన విద్యతోనే ఉపాధి అవకాశాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొలుసు పార్థసారధి, వేదకపై మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, పాశిం, ప్రముఖులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్య అందిస్తుండడంతో ఆదిశంకర విద్యాసంస్థల విద్యార్థులు పలు రంగాల్లో రాణిస్తున్నారని మంత్రులు కొలుసు పార్థసారధి, కొల్లు రవీంద్ర అన్నారు. శుక్రవారం కళాశాలలో విద్యాసంస్థల సిల్వర్‌జూబ్లీ వేడుకలు విద్యాసంస్థల చైర్మన్ వంకి పెంచలయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్యను అందించడం అభినందనీయమన్నారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకుని దేశం గర్వించదగ్గ ఇంజనీర్లుగా ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, జబర్దస్త్ టీం నాటి కలు, వందేమాతరం శ్రీనివాస్ గేయాలు ఆకట్టుకు న్నాయి. కార్యక్రమంలో తమిళనాడు మంత్రి రాజకన్నప్పన్, మాజీ మంత్రి పరసారత్నం, విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య, వంకి ప్రసూన, వంకి అరవింద, వంకి అనూష, వంకి ఐశ్వర్య, రాజమురుగదాస్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస కల్యాణం నాటిక ప్రదర్శన

కొత్తగుంట సెంటర్లో దుకాణం వెనుక పడేసిన హుండీ - బీరువా పగులగొట్టి చెల్లాచెదురుగా పడేసిన వస్తువులు





కొత్తగుంట సెంటర్లో దుకాణం వెనుక పడేసిన హుండీ - బీరువా పగులగొట్టి చెల్లాచెదురుగా పడేసిన వస్తువులు

చిట్టమూరులో దొంగలు పడ్డారు

ఇళ్లు, ఆలయాలు, దుకాణాల్లో చోరీ

చిట్టమూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలంలో గురువారం రాత్రి దొంగలు పడ్డారు. నాయుడుపేటలో జరిగిన ఉరుసు ఉత్సవాల విధుల్లో పోలీసులు ఉండడంతో ఇదే అదునుగా భావించిన దొంగలు చోరీలకు తెగబడ్డారు. మూడు ఆలయాలు, రెండు దుకాణాలు, మరో మూడు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. స్థానికుల సమాచారం మేరకు వివరాలు... సోమ సముద్రం గ్రామంలోని మందాలమ్మ ఆలయంలో వెండి ఆభరణాలు, తాళిబొట్టు అపహరించుకెళ్లారు. అదేవిధంగా చిట్టమూరమ్మ, తాడిమేడు మణికెట్లమ్మ ఆలయాల్లో చోరీకి యత్నించారు. చిట్టమూరు బీసీ కాలనీలోని షేక్ రఫీ ఇంట్లో ప్రవేశించిన దుండగులు చోరీ యత్నం చేయగా బెడ్ రూములో నిద్రిస్తున్న వాళ్లు బయటకు రావడంతో దొంగలు పరారయ్యారు. మల్లాం గ్రామంలో రాఘవులు ఇంట్లోకి ప్రవేశించి బీరువా పగలు గొట్టగా విలువైన వస్తువులు లేకపోవడంతో ఇంట్లో ఉన్న మొబైల్ ఫోన్ ఎత్తుకెళ్లారు. మరో ఇంట్లో గ్యాస్ సిలిండర్లు తీసుకెళ్లారు. కొత్తగుంటలో ఉన్న రఫీ చికెన్ షాపులో హుండీలో ఉన్న రూ.25 వేలు ఎత్తుకెళ్లారు. ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలోని బాబు చిల్లర దుకాణం తాళాలు పగలగొట్టి రూ.2వేలు తీసుకెళ్లారు. ఒకేరోజు మూడు గ్రామాల్లోని పలు ఇళ్లు, దుకాణాలు, ఆలయాల్లో చోరీలు జరగడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. శుక్రవారం ఉదయం ఎస్ఐ చిన్న బలరామయ్యకు సమాచారం ఇవ్వడంతో ఆయన చోరీ జరిగిన ఆలయాలు, దుకాణాలను పరిశీలించారు. నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ చెప్పారు.

తప్పిపోయిన వ్యక్తి మృతదేహం లభ్యం

బాలాయపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటంబేడు గ్రామానికి చెందిన తాడి వెంకటరమణయ్య(55) నాలుగు రోజులు క్రితం ఓజిలి మండలం రాగిపాడు గ్రామానికి చెందిన శివయ్యతో కలిసి అడవిలో వేటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో గురువారం వెంకటరమణయ్య కుమారుడు శివప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం కోటంబేటు సమీపంలోని తెలుగుగంగ కాలువలో వెంకటరమణయ్య మృతదేహన్ని పోలీసులు గుర్తించారు. పోస్టు మార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటరమణయ్యతో వెటకు వెళ్లిన శివయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

విశ్వామిత్ర యాగసంరక్షణ అలంకారంలో శ్రీరాముడు





విశ్వామిత్ర యాగసంరక్షణ అలంకారంలో శ్రీరాముడు - బలరాముడిగా కోదండరాముడు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి వసంతోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీరాముడు విశ్వామిత్ర యాగసంరక్షణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. అదేవిధంగా బ్రాహ్మణవీధిలోని సీతారాముల ఆలయంలో జరుగుతున్న వసంతనవరాత్రుల ఉత్సవాల్లో కోదండరాముడు బలరాముడిగా దర్శనమిచ్చారు.

మెమూ రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించండి



జీఎం సిన్హాతో మాజీ ఎంపీ వరప్రసాద్, జోసెఫ్, మస్తానయ్య

నాయుడుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి సూళ్లూరుపేట వరకు నడుపుతున్న మెమూ రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించాలని సదరన్ రైల్వే జీఎం సిన్హాను మాజీ ఎంపీ వరప్రసాద్ కోరారు. నాయుడుపేటకు చెందిన సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తానయ్య, డీఆర్‌యూసీసీ మెంబరు పేర్నాటి జోసెఫ్‌తో పాటు మాజీ ఎంపీ వరప్రసాద్ శుక్రవారం చెన్నైలో సదరన్ రైల్వే జీఎంను కలిశారు. చెన్నై నుంచి సూళ్లూరుపేట వరకు నడుపుతున్న మెమూ రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించాలని కోరారు. అలాగే చెన్నై ఎక్స్‌ప్రెస్, డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌లను నాయుడుపేటలో ఆపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కిరణ్, నాగేంద్ర, సాయి, సునీల్ పాల్గొన్నారు.

అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు

గూడూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక తిలక్‌నగర్‌లో నివాసముంటున్న మీరమ్మ(60) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందింది. ఆమెకు బంధువులు ఎవరూ లేకపోవడంతో స్థానికుడైన శరత్‌యాదవ్ మెగాబదర్స్ సేవాసమితి సభ్యులకు తెలియజేశారు. వారు అనాథ అయిన వృద్ధురాలికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో మోహన్, ఓంకార్, మధు, రాకేష్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్ అధ్యాపకురాలికి డాక్టరేట్



శ్రావణికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న విజయకుమార్‌రెడ్డి

కోట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న యరమల శ్రావణికి డాక్టరేట్ లభించింది. ఇన్వెజిగేషన్ ఆఫ్ ది క్యారెక్టర్ చిప్స్ ఆఫ్ రేయర్ ఎర్త్‌మెటల్ పీరియం ఆక్సైడ్ దోస్త్ జిర్కోనియా టఫ్ అండ్ అల్యూమినా సిరామిక్ కాంపోజిస్టు అనే అంశంపై చెన్నైలోని అన్నా యూనివర్శిటీ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజా, డాక్టర్ గణేషన్, ప్రొఫెసర్ ఈశ్వరి పర్యవేక్షణలోశ్రావణి పరిశోధనలు చేశారు. శుక్రవారం ఆమెను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డితో పాటు మెకానికల్ విభాగం అధిపతులు డాక్టర్ విక్రమ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసులు ప్రశంసాపత్రాలతో అభినందించారు.

విద్యార్థులకు డీఎస్పీ పరామర్శ

గూడూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిల్లకూరు డానియల్ చిల్డ్రన్స్ హోమ్ విద్యార్థులను శుక్రవారం డీఎస్పీ గీతాకుమారి పరామర్శించారు. కల్తీ ఆహారం తినడంతో 11 మంది విద్యార్థులు అస్వస్థతకు లోనయ్యారు. వారిలో ఇద్దరు విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిని డీఎస్పీ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

గూడూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో కాంచన అన్నారు. శుక్రవారం స్థానిక స్వర్ణాంధ్రభారతి పాఠశాలలో చదువులు, క్రీడలలో ప్రతిభచాటిన విద్యార్థులకు మెడల్స్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచే చదువులపై శ్రద్ధ చూపి కష్టపడి చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలన్నారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నవకోటి నాయుడు, సునీల్‌రాజ్, హరికృష్ణ, సింధు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నాం: సీపీఎం

గూడూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నామని సీపీఎం నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక పెద్దమసీదు వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లు వల్ల ముస్లింల ఆస్తులను అభివృద్ధి చేసేందుకు వీలుండదన్నారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, జోగి శివకుమార్, బీవీ రమణయ్య, మణి, చంద్రయ్య, నారాయణ, ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సిపార్సుతోనే మందులు విక్రయించాలి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వైద్యులు సిపార్సు చేస్తేనే మందులను విక్రయించాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి అన్నారు. శుక్రవారం స్థానిక రోటరీ క్లబ్ భవనంలో మందుల షాపుల యజమానులతో ఆమె సమావేశం నిర్వహించారు. మందులు విక్రయం, వినియోగంపై అవగాహన కల్పించారు. వైద్యుల సూచనల మేరకు మాత్రమే రోగులకు మందులు ఇవ్వాలన్నారు. కాలంచెల్లిన మందులు విక్రయించినా చర్యలు తీసుకుంటా మన్నారు.

ఓజిలి మండల బీజేపీ అధ్యక్షుడిగా పవన్‌కుమార్



బీజేపీ నాయకులతో పవన్‌కుమార్

ఓజిలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం బీజేపీ అధ్యక్షుడిగా బిల్లు పవన్‌కుమార్ ఎన్నికయ్యారు. శుక్రవారం సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆయనను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు రవీంద్రరాజు, ఆరుముళ్ల వరప్రసాద్, శేషయ్య పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

బాలాయపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు శుక్రవారం వడదెబ్బపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి సత్యప్రియ మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ఎండతీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దన్నారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, లలిత, నరసింహారావు, రజేశ్వరి, ప్రసూన పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకల్లో అశ్లీల నృత్యప్రదర్శన నిర్వహిస్తే చర్యలు

డక్కిలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకల్లో అశ్లీల నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తే నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ శివశంకర్ హెచ్చరించారు. ఈనెల 6నుంచి ప్రారంభమయ్యే నవమి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

అభ్యంతరాలపై అర్జీల స్వీకరణ

కోట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కోట తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం చెన్నై - బెంగళూరు కోస్టల్ కారిడార్ భూముల పరిహారంపై అభ్యంతరాలను తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో అధికారులు సేకరించారు. భూములు కోల్పోయిన రైతుల జాబితాను ఇది వరకే గ్రామసభ ద్వారా ప్రకటించారు.





నాయుడుపేట పట్టణంలోని హజరత్ అమీర్‌షావలి ఉరుసు మహోత్సవాల సందర్భంగా దర్గాను దర్శించుకుంటున్న టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి - సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ





విద్యుత్ అలంకరణలో హజరత్ అమీర్‌షావలి దర్గా - నిస్మి ఈవెంట్స్‌లో పాటలుపాడుతున్న కళాకారులు